


# విజయభాను




విజయవాడ, శనివారం 28-04-2018 | VIJAYABHANU DAILY VIJAYAWADA EDITION | సంపుటి : 10 సంచిక :322 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## దేశ రాజకీయాల్లో

# క్రియాశీల పాత్ర పోషిస్తాం

- పార్టీకి, ప్రభుత్వానికి నూతనోత్తేజం..
- వచ్చే ఎన్నికలకు సమాయత్తం..
- పార్టీ జెండాను అవిష్కరించి తెరాస ప్లీనరీ ప్రారంభం
- పార్టీకి ఇది 17వ ప్లీనరీ.. సీఎం కేసీఆర్



హైదరాబాద్ : పార్టీకి, ప్రభుత్వానికి నూతనోత్తేజం.. వచ్చే ఎన్నికలకు సమాయత్తం.. దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పునకు అంకురార్పణ లక్ష్యాలతో హైదరాబాద్‌లోని కొంపల్లిలో తెలంగాణ రాష్ట్ర సమితి ప్లీనరీ ప్రారంభమైంది. పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పార్టీ జెండాను ఆవిష్కరించి ప్లీనరీని ప్రారంభించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి కేసీఆర్ పూలమాల వేశారు. పార్టీకి ఇది 17వ ప్లీనరీ కాగా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత నాలుగోది. ప్లీనరీ వేదికకు తెలంగాణ ప్రగతి వేదికగా నామకరణం చేశారు. ఈ ప్లీనరీలో రాష్ట్ర, జాతీయ రాజకీయ ముఖచిత్రాన్ని ఆవిష్కరించడంతో పాటు పార్టీ శ్రేణులకు అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. ఈ ప్లీనరికి రాష్ట్రవ్యాప్తంగా తెరాస శ్రేణులు భారీసంఖ్యలో తరలివచ్చారు. ఆటపాటలతో కళాకారులు అలరిస్తున్నారు.

రాష్ట్రంలో, దేశంలో నెలకొన్న రాజకీయ పరిణామాల దృష్ట్యా.. సార్వత్రిక ఎన్నికలకు ముందు



నిర్వహిస్తున్న ఈ ప్లీనరీని తెరాస ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. రాబోయే ఎన్నికలకు ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయడానికి ప్లీనరీ వేదిక కానుంది. ఇప్పటికే పార్టీ గ్రామ, మండల కమిటీలు, రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటైంది. జిల్లా కమిటీల స్థానంలో నియోజకవర్గ కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీలకు ఎమ్మెల్యేలే అధ్యక్షులుగా ఉంటారు. ఎమ్మెల్యేలు లేని చోట్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు, ఇతర సీనియర్ నేతలను నియమించాల్సి ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రాధాన్యం దృష్ట్యా శ్రేణులను సన్నద్ధం చేయాలని భావిస్తున్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నీళ్లివ్వని పక్షంలో ఎన్నికల్లో ఓట్లు అడగబోమని సీఎం ఇప్పటికే పునరుద్ఘాటించారు.

దీనికి అనుగుణంగా ఆ ప్రాజెక్టు పనులు సాగుతున్నాయి. కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని తెలంగాణ వర్రపదాయినిగా తెరాస విశ్వసిస్తోంది. దీని పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మూడు నెలలకోసారి సర్వేలను నిర్వహిస్తూ

తరువాయి 2లో

# ప్రభుత్వానికి మంచిపేరు తెండి

- 108 వైద్య సేవా సిబ్బంది వేతనాలు పెంచుతాం
- మూడు షిఫ్టుల ఏర్పాటు వీలుకాదు
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



అమరావతిః రాష్ట్రంలో 108 అత్యవసర వైద్య సేవా వాహనాల్లో పనిచేసే సిబ్బంది కోర్కెలను సానుభూతితో పరిశీలిస్తామని, వారికి వేతనాలు పెంచుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు. సచివాలయంలో శుక్రవారం తనను కలసిన రాష్ట్ర 108 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. 108 వాహనాలలో పనిచేస్తూ సేవలు అందిస్తున్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లకు రూ.11,500 పైలెట్లకు రూ. 10,500 చెల్లిస్తున్నారని రాష్ట్ర 108 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు అధ్యక్షుడు బల్లి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఒక ప్రతినిధి బృందం ముఖ్యమంత్రిని కలిసింది. తమకు 50% జీతాలు పెంచాలని, అలా పెంచడంలో ఇబ్బందులు ఉన్న పక్షంలో తెలంగాణ రాష్ట్రంలోలా సగటున రూ. 4,000 పెంచాలని 108 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు ముఖ్యమంత్రిని కోరారు. త్వరలో వేతనాలు పెంచుతామని, సమస్యలను సానుభూతితో పరిశీలిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. క్షతగాత్రులకు తక్షణ వైద్య సేవలు అందడంలో చురుగ్గా వ్యవహరించి మంచిపేరు తెచ్చుకోవాలని, ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని ముఖ్యమంత్రి ఉద్బోధించారు. అత్యవసర వైద్యసేవలు అయినందువల్ల 8 గంటల

తరువాయి 2లో

# విశాఖలో అంత్రాక్స్‌ను కట్టడి చేయండి

### మంత్రి నక్కా ఆనందబాబు



అమరావతి: విశాఖ జిల్లాలో అంత్రాక్స్ వ్యాధి విజృంభించకుండా చర్యలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ అధికారులకు మంత్రి నక్కా ఆనందబాబు ఆదేశించారు. సచివాలయంలో అంత్రాక్స్, మలేరియా వ్యాధులపై మంత్రి సమీక్ష నిర్వహించారు. గిరిజన గ్రామాల్లో అంత్రాక్స్ వ్యాధి విధానం, ప్రస్తుత పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

పల్లెల్లో వైద్య బృందాలను ఏర్పాటు చేసి.. అనుమానం ఉన్నవారికి తక్షణ వైద్య సాయం అందించాలని సూచించారు. గిరిజనులకు అర్థమయ్యే భాషలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. వీలైనంత త్వరగా వ్యాధులు తగ్గుముఖం పట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా వేసవి దృష్ట్యా ఏజెన్సీలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని మంత్రి ఆదేశించారు.

# టెక్నాలజీతోనే సైబర్ సమస్యకు పరిష్కారం

- ఆర్‌టిజి వినియోగంలో దేశంలోనే మొట్టమొదటి రాష్ట్రం ఏపీ
- రాష్ట్ర ఐటి మరియు పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్



విశాఖపట్నం : గోబల్ ఫిన్ టెక్ ఎకో సిస్టం ద్వారా ప్రజలకు మరింత మరుగైన సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. డిజిటల్ సొల్యూషన్స్ అందించడంలో ఏపీ ప్రభుత్వం ఇప్పటికే ఎంతో ముందంజలో వుందని, ప్రతి వ్యక్తికి లేదా సంస్థకు సైబర్ సెక్యూరిటీ అందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని అన్నారు. శుక్రవారం

తరువాయి 2లో

# ఆంధ్రప్రదేశ్‌కు చల్లని కబురు

దిల్లీ: ఎండలతో మండిపోతోన్న ఆంధ్రప్రదేశ్‌కు వాతావరణశాఖ చల్లని కబురు అందించింది. రెండు రోజుల్లో అండమాన్ తీరంలో అల్పపీడనం ఏర్పడుతుందని వెల్లడించింది. దీని ప్రభావంతో దక్షిణ భారతంలోని తూర్పుతీర ప్రాంతంలో ఉష్ణోగ్ర తలు దిగివస్తాయని స్పష్టం చేసింది. ఈ నెల 29 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే సూచనలు ఉన్నాయని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. ఆ ప్రభావంతో అండమాన్ నికోబార్‌తో పాటు తమిళనాడు, కోస్తాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి తేలికపాటి జల్లులు కురుస్తాయని తెలిపింది. వాయువ్య భారత్ నుంచి వీస్తోన్న వేడి గాలుల ప్రభావానికి తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. గుజరాత్,

తరువాయి 2లో




## ఘనంగా గీతం దంత వైద్యకళాశాల పట్టభద్రుల దినోత్సవం

వార్త 8లో

## చంద్రబాబు, లోకేష్ నమ్మకద్రోహులు...

# అందుకే వైకాపాలోకి..

### మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత కన్న బాబు రాజు



విశాఖపట్టణం:విశాఖపట్టణం జిల్లాలో టిడిపికి గట్టి షాక్ తగిలింది. యలమంచిలి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత కన్నబాబు వైసీపీలో చేరనున్నారు. ఆ విషయాన్ని స్వయంగా ఆయనే వెల్లడించారు. ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. తాను గత ఎన్నికల్లో యలమంచిలిలో టీడీపీ విజయం కోసం తీవ్రంగా కృషి చేసి పార్టీ గెలుపులో కీలక పాత్ర పోషించానని చెప్పారు. కానీ టీడీపీ మాత్రం తనను చాలా చిన్నచూపు చూసిందని, అంతేకాకుండా స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబే తనను నమ్మించి మోసం చేశారని కన్న బాబు ఆరోపించారు. అలాగే నారా లోకేశ్ కూడా హామీ ఇచ్చి దారణంగా మోసం చేశారన్నారు.

అందుకోసమే వైసీపీలోకి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నాని, మే 5 వ తేదీన జగన్ సమక్షంలో ఆ పార్టీలో చేరనున్నట్లు కన్నబాబు వెల్లడించారు. ఈ విషయంలో భగవంతుడు దిగివచ్చి చెప్పినా వినేది లేదని తేల్చేశారు. వైసిపిలో చేరాక ఎమ్మెల్యే టికెట్ వచ్చినా రాకున్నా యలమంచిలి, పాయకరావు పేటలో వైకాపా గెలుపే లక్ష్యంగా

తరువాయి 2లో



# పేదల చదువుకు అండగా వుంటాం

### పుస్తకాలకు రూ. 3 వేలు ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్



విశాఖపట్నం : పేదల చదువుకు అండగా వుంటామని దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. విశాఖ దక్షిణం, 23వ వార్డు చెంగలరావుపేట మసీదు ముంగిట ముస్లిం ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలు తెలుసుకున్నారు. వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కల్లుపాకలకు చెందిన చిట్టిబోయిన లావణ్య అనే విద్యార్థినికి పుస్తకాలు కొనుక్కోవడానికి స్వంత నిధులు రూ. 3 వేలు ఆర్థిక సహాయం అందించారు. చక్కగా చదువుకోవాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఎంతో మంది నిరుపేద విద్యార్థులకు తన సొంత నిధులతో చదువునిస్తున్నానన్నారు. పేద విద్యార్థుల కళాశాల ఫీజులతోపాటు పుస్తకాలు కూడ కొనిస్తామన్నారు. పేదరికం కారణంగా విద్యార్థుల చదువు ఆగిపోకూడదన్నారు. విద్యతోనే ఉన్నత శిఖరాలనధిరోహించడం సాధ్యపడుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో కేధరిలక్ష్మి, బంగారి రవిశంకర్, నాసిఫ్ రహింతుల్లా, జఫ్రుల్లా, సారిపిల్లి తదితరులు పాల్గొన్నారు.

## రామనారాయణంలో గోపూజోత్సవం



విజయనగరం : ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణంలో గోపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం లక్ష్మీదేవి తిరునక్షత్రం ఉత్తరా నక్షత్రాన్ని పురస్కరించుకుని సుస్వర వేదమంత్రాల నడుమ దేవాలయం అర్చకులు చాణక్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవంలో ఎన్‌సిఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, పరిపాలనాధికారి ఉమామహేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## ప్రభుత్వానికి మంచిపేరు తెండి

విధుల నిర్వహణ విధానం అమలు వీలుకాదని, రెండు షిఫ్టులలో 108 ఉద్యోగులు పనిచేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి కార్యదర్శి గిరిజాశంకర్, వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ పూనం మాలకొండయ్య, సలహాదారు జితేంద్ర శర్మ, 108 సర్వీసుల సంయుక్త సంచాలకుడు, నోడల్ అధికారి డా. రాజేంద్ర ప్రసాద్ తదితరులు ముఖ్యమంత్రి వెంట ఉన్నారు.

## దేశ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషిస్తాం

ప్రజాప్రతినిధులు లోటుపాట్లను సీఎం వివరిస్తున్నారు. 2019 ఎన్నికల బృందం ఇప్పటికే ఖరారైంది. ప్లీనరీ వేదికగా వీటన్నింటిపై సీఎం దిశానిర్దేశం చేయనున్నారు.

విస్తృత ఏర్పాట్లు

23 దేశాల నుంచి 200 మందికి పైగా తెలంగాణ ప్రవాస శాఖల ప్రతినిధులు తరలిరానున్నారు. విద్యార్థి విభాగం నుంచి 15 వందల మంది వాలంటీర్లు విధులు నిర్వహిస్తున్నారు. కార్యకర్తల కోసం రుచికరమైన మాంసాహార, శాకాహార వంటకాలను సిద్ధం చేస్తున్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా సభా ప్రాంగణంలో అంబలి, మజ్జిగ, మంచినీటి సరఫరా కేంద్రాలను ప్రారంభించారు. శుక్రవారమైనందున ముస్లిం సోదరుల నమాజ్ కోసం ప్రత్యేక స్థలం కేటాయించారు.

## టెక్నాలజీతోనే సైబర్ సమస్యకు పరిష్కారం

నోవోటెల్ హోటల్ నందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, మాస్టర్ కార్డ్స్ సంయుక్తంగా నిర్వహించిన సైబర్ సెక్యూరిటీ సదస్సులో ఐటి మంత్రి ముఖ్య అతిధిగా హజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నాలజీ ద్వారా ముఖ్యంగా రైతులకు ఆదాయం పెరిగేలా, స్మార్ట్ సిటీస్‌లో డిజిటల్ పేమెంట్లు ఎలా చేయాలనే అంశాలపై, టెక్నాలజీ ద్వారా సైబర్ సెక్యూరిటీ సమస్యలు ఎలా వస్తాయి, వాటి పరిష్కారాలేంటి అనే అంశాలపై కెపాసిటీ బిల్డింగు చేపట్టడం తదితర అంశాలపై దృష్టి సారించామన్నారు. టెక్నాలజీ వినియోగం వలన సైబర్ అటాక్స్ పెరిగే అవకాశం ఉందని, వీటిని ఎదుర్కోవడానికి సెబర్ సెక్యూరిటీస్ అవసరమని భావించి దీనిని మొట్టమొదటీసారిగా ఏపీలోనే ప్రారంభించడం జరిగిందన్నారు. విశాఖపట్నంకు ఫ్రాంక్లిన్, కాండ్యుయెంట్ లాంటి పెద్ద కంపెనీలు వచ్చాయని, వీటిలో ఉద్యోగావకాశాలు వచ్చేలా చూస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ఐటి సలహాదారు జెఎ చౌదరి మాట్లాడుతూ బ్యాంకింగ్ ఫైనాన్స్ రంగంలో కీలక డేటాలను సైబర్ దాడులనుండి పరిరక్షించుకోవడానికి రానున్న రోజుల్లో పెద్ద సంఖ్యలో సైబర్ సెక్యూరిటీస్ నిపుణులు అవసరమై ఉందని అన్నారు. ఇందుకోసం యువతను సిద్ధం చేస్తున్నామని అన్నారు. ఎథికల్, హ్యాకింగ్, సైబర్ సెక్యూరిటీ అంశాల్లో నైపుణ్యం గల యువతకు భారీ వేతనాలు అందించేందకు పలు కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు.

ఐటి ముఖ్య కార్యదర్శి విజయానంద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఐటి పాలసీ, స్టార్టప్ పాలసీ, సైబర్ సెక్యూరిటీ పాలసీల అమలులో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో ముందుకు వెళుతుందని అన్నారు.

మాస్టర్ కార్డ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవి అరోరా మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సైబర్ దాడులు అనేవి వ్యక్తిగతంగా, సంస్థాగతంగా వుంటూ అవి జాతీయ స్థాయిలో దేశ ఆర్థిక పరిస్థితిపై ప్రభావం చూపుతుందని అన్నారు. ప్రతీ వ్యక్తి ప్రతీ చెల్లింపులో మాస్టర్‌కార్డ్, డిజిటల్ టెక్నాలజీని సమర్థవంతంగ ఉపయోగించుకోవడం తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దేశ విదేశాలకు చెందిన ప్రతినిధులు, అధికారులు, విద్యావేత్తలు, ఎపెటా సిఇఓ తిరుమలరావు, సైబర్ సెక్యూరిటీ నిపుణులు హాజరైనారు. ఏపీఐటిఏ ఆధ్వర్యంలో నిర్వహించిన సైర్డన్ హ్యాకథాన్‌లో విజయం సాధించిన విద్యార్థులకు అవార్డులు, ప్రోత్సాహకంగా చెక్కులు మంత్రి అందజేశారు.

## చంంద్రబాబు, లోకేష్ నమ్మకద్రోహం...

పని చేస్తానని కన్నబాబు చెప్పారు. కాంగ్రెస్ హయాంలో యలమంచిలి ఎమ్మెల్యేగా ఎన్నికైన కన్నబాబు విశాఖ జిల్లా రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. మంత్రి కొణతాల హయాంలో హవా సాగించారు. తదనంతరం రాష్ట్ర విభజన నేపథ్యంలో కాంగ్రెస్‌ని వీడి టిడిపిలో చేరారు. టిడిపిలో ఎమ్మెల్యే టికెట్ దక్కకపోయినా ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తారని ఆశించారు. అయితే తనకు చంద్రబాబు,లోకేష్ స్వయంగా హామీలు ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయలేదని, పైగా నియోజకవర్గంలోనూ ప్రాధాన్యత ఇవ్వడం లేదనే కన్నబాబు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వీటికితోడు యలమంచిలి నియోజకవర్గంలో టిడిపి ఎమ్మెల్యే టిక్కెట్ కోసం ఆశావాహుల సంఖ్య అంతకంతకూ పెరిగిపోతుండటంతో ఇక తనకు అవకాశం లభించడం దుర్లభమనే ఆలోచనతో ఆయన టిడిపిని వీడుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై అనుచరులు, కార్యకర్తలతో సమావేశమై చర్చించిన అనంతరం వైసీపీలో చేరేందుకు కన్నబాబు ముహూర్తం కూడా ఖరారు చేసుకున్నారు.

## ఆంధ్రప్రదేశ్‌కు చల్లని కబురు

మహారాష్ట్రలోని విదర్భ, తెలంగాణ మీదుగా ఉష్ణగాలుల ప్రభావం కొనసాగుతోంది. ఆయా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతల తీవ్ర గరిష్ఠానికి చేరుకుంటోంది. సాధారణ ఉష్ణోగ్రతల కంటే ఆరు డిగ్రీల వరకు పెరుగుదల నమోదైందని వాతావరణ శాఖ స్పష్టంచేసింది. విదర్భలో అత్యధికంగా 45.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏపీలోని అత్యధికంగా తిరుపతిలో 44 డిగ్రీలు, విజయవాడ, అమరావతి, గుంటూరులలో 42 డిగ్రీల సెల్షియస్ చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# 14 నుంచి విశాఖలో 4వ రాష్ట్ర స్థాయి జర్నలిస్టుల క్రికెట్ పోటీలు

### - 13 జిల్లాల నుంచి 15 జట్లు హాజరు
### - విన్నర్స్ ట్రోఫీని ఆవిష్కరించిన సి.యం.ఆర్. గ్రూపుల అధినేత మావూరి



విశాఖపట్నం : విశాఖ వేదికగా మే 14 నుంచి 4వ రాష్ట్రస్థాయి అక్రిడేటెడ్ జర్నలిస్టుల క్రికెట్ టోర్నీని నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని వైజాగ్ జర్నలిస్టుల ఫోరమ్ అధ్యక్ష, కార్యదర్శులు గంట్ల శ్రీనుబాబు, టోర్నీ గౌరవ ఛైర్మన్, ఎస్. దుర్గారావు (టోర్నీ ఛైర్మన్)లు తెలిపారు. రాజీవ్‌గాంధీ పోర్టు స్టేడియంలో 14 నుంచి 20 వరకు ఈ పోటీలు నిర్వహించబోతున్న వివరించారు. ఇందుకు సంబంధించి శుక్రవారం సి.యం.ఆర్. గ్రూపు సంస్థల అధినేత మావూరి వెంకటరమణ చేతులమీదుగా విన్నర్స్ ట్రోఫీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు, దుర్గారావులు మాట్లాడుతూ వారంరోజులకి పైగా జరిగే ఈ టోర్నీలో రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి సుమారు 15 జట్లు హాజరయ్యే అవకాశం వుందన్నారు. సుమారు 250 మంది జర్నలిస్టులు ఈ టోర్నీలో పాల్గొన్నట్టు తెలిపారు. క్రీడాకారులకు ఉచితంగా వసతి, భోజన, తదితర సదుపాయాలు కల్పిస్తామన్నారు. వీటితోపాటు విన్నర్స్, రన్నర్స్, తృతీయస్థానంలో నిలిచిన జట్లకు అతిథుల చేతులమీదుగా ట్రోఫీలు, బహుమతులు అందజేస్తామన్నారు. టోర్నీకి హాజరయ్యే జట్లు 13వ తేదీ నాటికి విశాఖ చేరుకోవాలన్నారు. దీనితోపాటు క్రీడాకారులంతా విధిగా ఒరిజనల్ అక్రిడియేషన్ కార్డులకు తమతో తీసుకురావాలన్నారు. విశాఖ స్పోర్ట్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ సహకారంతో వి.జె.ఎఫ్. ఈ టోర్నీని నిర్వహిస్తుందన్నారు. సి.యం.ఆర్. గ్రూపు సంస్థల అధినేత మావూరి వెంకటరమణ మాట్లాడుతూ విశాఖలో 4వ సారి రాష్ట్రస్థాయి జర్నలిస్టుల క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గతంలో కూడా ఎంతో సమర్థవంతంగా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించిన ఘనత వి.జె.ఎఫ్.కే దక్కుతుందన్నారు. సమాజభివృద్ధి అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడే జర్నలిస్టులకు ఇటువంటి క్రీడాపోటీలు వల్ల మెరుగైన ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ ట్రోఫీ ఆవిష్కరణలో వి.జె.ఎఫ్. ఉపాధ్యక్షులు ఆర్. నాగరాజు పట్నాయక్, టి. నానాజీ, కోశాధికారి పి.ఎన్. మూర్తి, జాయింట్ సెక్రటరీ దాడి రవికుమార్, వి.జె.ఎఫ్. పాలకవర్గ సభ్యులు, సి.యం.ఆర్.కు చెందిన లింగమూర్తి, మాడా తదితరులు పాల్గొన్నారు.

# చేపల తిమ్మాపురంలో రోడ్డు పనులు అడ్డుకున్న మత్స్యకారులు



భీమునిపట్నం : భీమిలి మండలం, కె.నగరపాలెం పంచాయతీ, చేపల తిమ్మాపురం సర్వే నంబర్ 314 ప్రభుత్వ స్థలంలో సుమారు ఐదు సంవత్సరాల క్రితం 136 కుటుంబాలకు చెందిన మత్స్యకారులు కూలి పనులు చేసుకుంటూ ఇల్లు నిర్మించుకొని వుంటున్నారు. ఇటివల జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి స్థలాన్ని ఖాళీ చేయమని నోటీసులు పంపారు.వాటిని లెక్క చేయకుండా రోడ్లు పనుల నెపంతో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తున్నారని, అక్కడ వున్న మత్స్యకార కుటుంబాలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భం గా మత్స్యకార నాయకుడు మారుపల్లి. అమర్నాధ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి నెపంతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం క్రింద కాలువలు, సీసీ రోడ్లు నిర్మాణాన్ని హడావిడిగా ప్రారంభించారని అన్నారు. మత్స్యకార సొసైటీ స్థలానికి సరియైన కాలువలు రోడ్లు వేయకుండా, ఈ స్థలం లో రోడ్లు,ఇంటింటికి కాలువ కనెక్షన్ లు వేయటం విడ్డురంగా ఉందన్నారు. ఈ విధంగా నిధుల దుర్వినియోగానికి మా గ్రామ సర్పంచ్ పాల్పడుతున్నారని, ఈ విషయమై జాయింట్ కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించామని, భవిష్యత్తులో తమ ఇళ్లను తొలగించమని అధికారులు హామీ ఇస్తే రోడ్లు పనులకు సహకరిస్తామని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ మారుపిల్లి పార్వతమ్మ, కార్యదర్శి మైలపిల్లి ఎర్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు. ఇదే విషయమై స్థానిక తహసీల్దార్ గంగాధరరావు ను వివరణ అడుగగా కాలువలు, రోడ్ల పనులు వెంటనే నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

### ఉద్యోగ విరమణ చేసిన హెూంగార్డు అప్పారావుకు ఆర్థిక సహాయం జిల్లా ఎస్పీ జి. పాలరాజు



విజయనగరం : జిల్లా పోలీసుశాఖలో హెూంగార్డుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన లేదా ఉద్యోగ విరమణ కంటే ముందే మరణించినా వారి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని ఇకపై అందించనున్నట్లుగా విజయనగరం జిల్లా ఎస్పీ జి. పాలరాజు తెలిపారు. మిగిలిన ప్రభుత్వ ఉద్యోగుల వలే ఉద్యోగ విరమణ చేసిన హెూంగార్డులకు ఎటువంటి ఆర్థిక బెనిఫిట్స్ లేకపోవడంతో హెూంగార్డు కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నాయి. వీటిని అధిగమించేందుకుగాను జిల్లా పోలీసుశాఖలో పనిచేసే హెూంగార్డులు ఇకపై ఎవరైనా ఉద్యోగ విరమణ చేసినా లేదా ఉద్యోగవిరమణ కంటే ముందే మరణించినా వారి కుటుంబాన్ని ఆర్థికంగా అదుకొనేందుకు మిగిలిన హెూంగార్డులు ఒక్క రోజు తమ వేతన అలవెన్సును ఇచ్చేందుకు జిల్లా ఎస్పీకి తమ సంసిద్ధతను తెలియజేసారు. ఈ విషయాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ హెూంగార్డుల అభ్యర్ధనకు ఆమోదం తెలిపారు. ఇందులో భాగంగా గత మాసంలో ఉద్యోగ విరమణ చేసిన హెూంగార్డు కోరాడ అప్పారావు (హెచ్.జి. 54)కు హెూంగార్డుల ఒక్క రోజు డ్యూటీ అలవెన్సు రూ. 2,38,400ల చెక్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ పాలరాజు అందజేసారు. ఈ కార్యక్రమంలో హెూంగార్డ్సు ఇన్‌చార్జ్ ఆర్ఎస్ఐ మురళీధర్, ఆఫీసు సూపరింటెండెంట్ బి.చంద్రశేఖర్, జూనియర్ సహాయకులు హరి పాల్గొన్నారు.

# అంగన్వాడీ సెంటర్‌లో కాన్వొకేషన్ డే



భీమునిపట్నం : భీమిలి ఎగువపేట అంగన్వాడీ సెంటర్ లో కాన్వొకేషన్ డే ఐసిడిఎస్ పి.ఒ డి.వెంకటీశ్వరి ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా భీమిలి డివిజన్ టీడీపీ అధ్యక్షులు గంటా. నూకరాజు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా అంగన్వాడీ సెంటర్ లలో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అందువలన ప్రతి ఒక తల్లిదండ్రులు గుర్తించి తమ పిల్లలను అంగన్వాడీ సెంటర్ లలో చెర్పించాలని చెప్పారు. అదే విధంగా యు.కె.జి. పిల్లలను 1వతరగతి కి ప్రమోటు చేసి వారికి సర్టిఫికెట్ ఇచ్చారు.

ఇంకా ఈ కార్యక్రమంలో టీ.డీ.పి.నాయకులు రాజగిరిరమణ మారోజు సంజీవ్ కుమార్, ఐసిడిఎస్ సూపర్ వైజర్ సుస్మిత ,అంగన్వాడీ టీచర్స్ శాంతి కుమారి,శ్రీగౌరి, కామేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

# 30న శ్రీక్షేత్రమ్‌లో చందనోత్సవం

విజయనగరం : ప్రముఖ భారతీయ తత్త్వదర్శన కేంద్రం శ్రీక్షేత్రమ్‌లో కొలువై యున్న అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 30వ తేదీ సోమవారం చందనోత్సవం నిర్వహించనున్నారని ధర్మకర్త దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు ఒక ప్రకటనలో తెలిపారు. వైశాఖ శుద్ధ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని చల్లదనం కోసం వేంకటేశ్వర స్వామికి నరసింహస్వామి అలంకారంలో చందనోత్సవం జరుగుతుందని, భక్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# టీఎస్ పది ఫలితాలు విడుదల



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి సచివాలయంలో విడుదల చేశారు. ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం 83.78గా నమోదైనట్టు వెల్లడించారు. ఈ ఫలితాల్లో మళ్లీ బాలికలే పైచేయి సాధించారు. వారి ఉత్తీర్ణత శాతం 85.14 కాగా.. బాలురు 82.46 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది మొత్తం 2125 పాఠశాలలు నూరు శాతం ఉత్తీర్ణత సాధించగా.. 21 పాఠశాలల్లో సున్నా శాతం నమోదైంది. వీటిలో 11 ప్రైవేటు పాఠశాలలు ఉండటం గమనార్హం. తెలంగాణలోని మొత్తం 31 జిల్లాలకు గాను జగిత్యాల, కరీంనగర్, సిద్దిపేట తొలి మూడు స్థానాల్లో నిలవగా.. ఆదిలాబాద్ ఆఖరు స్థానంలో నిలిచింది. మార్చి 15 నుంచి ఏప్రిల్ 2 వరకు రాష్ట్రవ్యాప్తంగా 2542 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షలను 5,34,726 మంది విద్యార్థులు రాసిన విషయం తెలిసిందే.

**అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ షెడ్యూల్..**

పరీక్ష తప్పిన విద్యార్థుల కోసం జూన్ 4 నుంచి జూన్ 19 వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్టు మంత్రి వెల్లడించారు. ఇందు కోసం రుసుము కట్టేందుకు మే 21 ఆఖరు తేదీగా నిర్ణయించారు. రీవాల్యుయేషన్, రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకొనే వెసులుబాటును కల్పించినట్టు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల కన్నా రెసిడెన్షియల్ పాఠశాలలు, మోడల్ పాఠశాలలు మంచి ఉత్తీర్ణత సాధించాయన్నారు.

## విజయభాను సంపాదకీయం

### గుర్తుకొస్తున్నాయి చేదు జ్ఞాపకాలు

పెద్ద నోట్ల రద్దు కాలం నాటి చేదు జ్ఞాపకాలు మళ్లా ప్రజల అనుభవానికి వస్తున్నా, కేంద్ర ప్రభుత్వం మాత్రం అటువంటి సమస్యే లేనట్టు మాట్లాడటం ఆశ్చర్యం కలిగిస్తున్నది. ఏటీఎంలలో డబ్బు లేక ప్రజలు బేజారయిపోతున్నారు. ఇది మన రాష్ట్రంలోనే కాదు, ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఇటువంటి సమాచారమే వస్తున్నది. తెలంగాణలోనే కాదు, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్ తదితర రాష్ట్రాలలో నోట్ల కొరత పీడిస్తున్నది. కొన్ని నెలలుగా ఈ సమస్య ముదురుతూ వస్తున్నది. అయినా కేంద్రం సమస్య ఉన్నట్టు అంగీకరించడమే లేదు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ సమస్య లేదంటూనే ఉన్నట్టు పరోక్షంగా అంగీకరిస్తున్నారు. కరెన్సీ పరిస్థితిపై సమీక్ష జరిపామని, బ్యాంకులలో అవసరానికి మిం చిన కరెన్సీ అందుబాటులో ఉందని ఆయన అన్నారు. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో హఠాత్తుగా అసాధారణ స్థాయిలో ప్రజలు నోట్లు తీసుకోవడం వల్ల కొరత ఏర్పడి ఉండవచ్చునని ఆయనే అంటున్నారు. ఆర్బీఐ ధోరణి కూడా ఇందుకు భిన్నంగా లేదు. బ్యాంకుల్లో చాలినంత కరెన్సీ ఉన్నదనీ, అయినా నోట్ల ముద్రణ పెంచామని, రవాణా సమస్య వల్ల కొన్ని ప్రాంతాలలో కొరత ఏర్పడిందని ఆర్‌బీఐ చెబుతున్నది. అసాధారణ స్థాయిలో నోట్ల వినియోగం పెరిగినందువల్ల కొరత ఏర్పడిందనీ, ఐదు వందల రూపాయల నోట్లను ఐదింతలు ఎక్కువగా ముద్రిస్తున్నామ ని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్‌చంద్ర గార్గ్ తెలిపారు. నోట్ల కొరతే లేదని, అటువంటి సమస్య కొన్ని ప్రాంతాలలో తలెత్తడానికి హఠాత్తుగా ప్రజలు పెద్ద ఎత్తున డబ్బు తీసుకోవడమే కారణమని ఈ పెద్దలు అంటున్నారు. నోట్ల కొరత తీర్చడానికి తాము చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నట్టు నమ్మమంటున్నారు. కానీ వాస్తవం మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నది. గణాంకాలను తవ్వి తీస్తే, ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నోట్ల చెలామణిని తగ్గించిందని రూఢీగా తెలుస్తున్నది. కొంతకాలంగా ఆర్‌బీఐ నోట్ల సరఫరాను తగ్గిస్తూ ఉన్నది. ఆర్‌బీఐ నుంచి తాము కోరిన మేర కనెన్సీ రావడం లేదని బ్యాంకులు లోపాయికారిగా అంగీకరిస్తున్నా యి. పెద్ద నోట్ల రద్దు తర్వాత రోజుకు పది వేల కోట్ల రూపాయల మేర చెలామణిలోకి వచ్చేది. అది క్రమంగా దాదాపు ఐదు వేల కోట్లకు పడిపోయింది. ఇప్పుడు పదిహేను వందల కోట్లకు తగ్గింది. ఇంతగా సరఫరా తగ్గిన తర్వాత నోట్ల కొరత ఏర్పడదా? ఒక సంస్థ సమాచార హక్కు చట్టం ప్రకారం పొందిన వివరాల ప్రకారం- తెలంగాణ రాష్ట్రంలోని ఎస్‌బీఐ శాఖలకు 201 7 సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు నోట్ల సరఫరా మూడో వంతుకు తగ్గిపోయింది. దీన్నిబట్టి నోట్ల కొరతకు ఆర్‌బీఐ సరఫరా తగ్గించడమే కారణమని స్పష్టమవుతున్నది. బ్యాం కుల నుంచి ప్రజలు తీసుకున్న సొమ్మును తిరిగి జమచేయడం లేదనే మాట కూడా వినబడుతున్నది. అయితే దీనికి కారణం కూడా ప్రభుత్వ విధానమే. తాము బ్యాంకుల్లో డబ్బు వేస్తే తిరిగి వస్తుందనే భరోసా ప్రజలకు లేదు. ప్రభుత్వం పెద్ద నోట్లను రద్దుచేసిన నాటినుంచి గ్రామీణులు చేతిలో రూకలు ఆడక చాలా ఇక్కట్లు పడుతున్నారు. ఇప్పుడు పట్టణ ప్రాంతాల్లోనూ ఈ సమస్య తలెత్తింది. కేంద్రం క్రమంగా నోట్ల పాత్ర తగ్గించి, ప్రజలను ఆన్‌లైన్ లావాదేవీల వైపు నడిపిస్తున్నదనే అనుమానాలు ఇప్పుడు మరింతగా వ్యక్తమవుతున్నాయి. ఆన్‌లైన్ లావాదేవీలను మాత్రమే అమలుచేయడం సాధ్యమా అనే విషయం ఎట్లా ఉన్నా, ప్రభుత్వానికి అటువంటి ఉద్దేశమే కను క ఉంటే ఆ విషయాన్ని తేటతెల్లంగా చెప్పాలె. ప్రజాస్వామ్య వ్యవస్థలో రహస్య అజెండాలు ఉండకూడదు. పెద్ద నోట్ల రద్దు నిర్ణయాన్ని కూడా ప్రధాని హఠాత్తుగా ప్రకటించారు. దీనివల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ఇంకా పడుతూనే ఉన్నారు. పెద్ద నోట్లను రద్దు చేసినప్పుడు, ఈ చర్య వల్ల నల్లధనం బయటికి వస్తుందని, ఉగ్రవాదుల ఆటకడుతుందని ప్రచారం సాగింది. కానీ ఇదంతా వట్టిదేనని తెలిసిపోయింది. ప్రభుత్వానికి ఉన్న అసలు ఉద్దేశం నోట్ల చెలామణిని తగ్గించడమే. కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ ఇప్పు డు నోట్ల సరఫరాను తగ్గిస్తూ కూడా ఆ విషయా న్ని బహిరంగంగా అంగీకరించడంలేదు. కానీ ప్రజలకు మాత్రం కేంద్ర ప్రభుత్వం నోట్లను తగ్గిస్తున్నదని అనుభవం ద్వారా అర్థమైంది. ప్రజలు నోట్లను దగ్గర పెట్టుకుంటున్నారనీ, బ్యాంకులలో వేయడం లేదని బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారే అంటున్నారు. దీన్నిబట్టి ప్రజలకు ప్రభుత్వ విధానాలపట్ల భయాందోళనలు నెలకొన్నాయని అర్థమవుతున్నది. ప్రభుత్వ హామీల ను ప్రజలు విశ్వసించడం లేదు. బ్యాకింగ్ వ్యవస్థ మీద కూడా ప్రజలు విశ్వాసం సన్నగిల్లుతున్నది. ఇది చాలా ప్రమాదకర పరిణామం. కేంద్రం ఇప్పటికైనా నిజాయితీగా, ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలె.

## ఏపిఈపిడిసిఎల్ అధికారులతో ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం సమావేశం



విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో ప్రపంచ బ్యాంకు నిధులతో జరుగుతున్న ప్రాజెక్టులపై ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందంతో ఏపిఈపిడిసిఎల్ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ హెచ్.వై.దొర సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రపంచబ్యాంకు నిధులతో పశ్చిమ గోదావరిలో జరుగు తున్న హెచ్‌విడిఎస్ పనులు, విశాఖపట్నంలో ఏర్పాటు చేయబోవుచున్న 33/11కెవి 30 సబ్‌స్టేషన్లు ( 3 పేకేజీలు) ఇతర జిల్లాలలో ఏర్పాటు చేయబోవుచున్న 33/11కెవి 16 సబ్‌స్టేషన్లు (2 పేకేజీలు), ఆర్‌ఎపి డిఆర్‌పి టౌన్లలో ఏర్పాటు చేస్తున్న 33 ఇంటర్ లింకింగ్ లైన్లకు సంబంధించిన పనులపై హెచ్.వై.దొర సమీక్షించారు.

అదేవిధంగా విశాఖనగరంలో జరుగుతున్న భూగర్భ కేబుల్ ప్రాజెక్టు ఏర్పాటులో విశాఖపట్నం జోన్-1 డివిజన్లో మిగిలిన 6 సబ్‌స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేయబోతున్న భూగర్భ కేబుల్ ప్రాజెక్టు (2 పేకేజీలు), విశాఖపట్నం సిటీలో 82, కాకినాడ టౌన్లో 15 సబ్‌స్టేషన్లలో ఏర్పాటు చేయబోయే స్కాడా, స్మార్ట్ మీటర్స్, ఇతర పంపిణీ సామర్థ్యాలను పెంచుకునే పనులకు సంబం ధించిన ప్రతిపాదనలకు ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు. ఈ సమావేశంలో మణిఖురానా నాయకత్వం లోని ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందంలో ప్రొక్యూర్మేంట్ ఎక్సర్ట్ అన్మోల్, ఒబైద్, కవిత, ఎస్.సతీష్ పాల్గొనగా ఏపిఈపి డిసిఎల్ నుంచి డైరక్టర్లు టి.వి.ఎస్.చంద్రశేఖర్, బొడ్డు శేషు కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ బి.రమేష్ ప్రసాద్, ఏపిఈపిడిసిఎల్ వరల్డ్ బ్యాంకు విభాగపు సిబ్బంది, ఐటి విభాగపు సిబ్బంది పాల్గొన్నారు.

## ఇది ఆధ్యాత్మిక సూఫీ పరంపర : జిల్లా ఎస్సీ జి.పాలరాజ్

విజయనగరం: మహోన్నతమైన సూఫీ సంప్రదాయ రీతులకు, ఆధ్యాత్మిక సౌరభాలకు విజయనగరం ఖాదర్ బాబా దర్బార్ ముఖద్వారం అయిందని..హజరత్ ఖాదర్ బాబా వారి ప్రియ శిష్యులు సూఫీ మహాత్మ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా వారు గత 40 ఏళ్ళుగా బాబా వారి సుగంధమహోత్సవాలను చేస్తున్నారని నిత్య అన్నదాన క్రతువును నిర్వహించట ముదాహమని జిల్లా పోలీసు సూపరెంటెండెంట్ జి.పాలరాజు అన్నారు. శుక్రవారం బాబామెట్టలోని హజరత్ ఖాదర్ వలి వారి సుగంధ మహోత్సవానికి వారు విచ్చేసారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ...తరతరాలు ఈ సంప్రదాయాన్ని పునరుద్ధరిస్తూ ఎందరో ఆర్తులకు... అన్నార్తులకు, ఆనాథలకు అన్న సమారాధన క్రతువుగా నిర్వహించటం దేశం గర్వించదగ్గ విషయమన్నారు. భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. దేశం పార్టీ జిల్లా ప్రధాన కార్య దర్శి ఐ.వి.పి.రాజు మాట్లాడుతూ ప్రతీ ఏటా ఈ ఉత్సవాలకు వచ్చి వారి దర్శనం చేసుకుంటామని అది మాకు...విజయనగర ప్రజలకు ఎన్నో విజయాలకు ఆశీర్వాదమని తెలిపారు. అనంతరం మున్సిపల్ వైస్‌చైర్మన్ కనకల మురళీ మోహనరావు, ఎంఎల్ఏ.పతివాడ నారాయణ స్వామి నాయుడు, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్య క్షులు భీశెట్టి బాబ్జీ, వైఎస్ఆర్ పార్టీ ఉత్తరాంధ్ర కన్వీనర్ కోలగట్ల వీరబద్రస్వామి, డిఎస్పీ తదితర అధికారులు, అనధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఖాదర్ బాబా వారినిదర్శించుకుని, వారి ప్రియ శిష్యులను కలుసుకున్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధికి సాధికారమిత్రలే కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సతీమణి పద్మావతి

నర్సీపట్నం : మహిళల ఆర్థికాభివృద్ధికి సాధికార మిత్రలే కీలకమని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి పద్మావతి అన్నారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో సాధికార మిత్రలకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలంటే సాధికారమిత్రలు ఎప్పటికప్పుడు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మహిళలకు సమాచారం అందించాలన్నారు. ప్రభుత్వం సాధికారమిత్రలతో ప్రజలందరికీ న్యాయం జరిగేందుకు నియమించిందన్నారు. ప్రతీ 30 నుండి 35 కుటుంబాలకు ఒక్కో సాధికార మిత్రను నియమించి అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలనే దృక్పదంతో ఈ కార్యక్రమం చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు కోఆర్డినేటర్ పోతల రమణ, ఏపిఎం ఎన్.సత్తిబాబు పాల్గొన్నారు.

## లబ్ధిదారులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఛైర్‌పర్శన్ రమాకుమారి

యలమంచిలి రూరల్ : తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే మున్సిపాలిటీ రిధిలో మెట్టమొదటి సారిగా భారీ స్థాయిలో లబ్ధిదారులకు నివాస గృహాలు ఇవ్వడం జరుగుతుందని యలమంచిలి మున్సిపల్ వైస్ ఛైర్మన్ పిళ్లా రమాకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఇళ్లు, స్థలం లేని లబ్ధిదారులకు జిప్లస్-2 గ్రూపు హౌస్‌లు నిర్మాణం చేపట్టేందుకు ఎంపిక చేసిన లబ్ధిదారులకు బ్యాంకర్స్‌తో హౌసింగ్ రుణంపై అవగాహన కల్పించేందుకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రమాకుమారి మాట్లాడుతూ మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత పెద్ద స్థాయిలో మొదటి విడతగా వ్యక్తిగత ఇళ్లు 1570 మంజూరు కాగా గ్రూపు హౌస్‌లకు 608 మంది లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే వ్యక్తిగత ఇళ్లకు అనుమతి పత్రాలు అందజేయడం జరిగిందని, గ్రూపు హౌస్‌లు కూడా ఈ బ్యాంకర్స్ అవగాహన సదస్సు అనంతరం కట్టడాలు ప్రారంభించడం జరుగుతుందన్నారు. 300 ఇళ్లు పెంజెరువు సమీపంలో, మరో 300 ఇళ్లు శేషుకొండ సమీపంలోనపు నిర్మాణం చేసేందుకు స్థల సేకరణ జరిగిందన్నారు. జిప్లస్-2 ఇళ్ల నిర్మాణం సుమారు ఒక్కొక్క లబ్ధిదారునికి 12లక్షల నిర్మాణ ఖర్చులు కాగా మూడున్నర లక్షలు బ్యాంకు రుణం ఉంటుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్టీఆర్ గృహ వసతి పేరు మీద నిరుపేదలకు గూడు కల్పించాలనే ఉద్దేశ్యంతో అన్న ఎన్టీఆర్ ఆశయసాధనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్షేమ పథకాల్లో భాగంగా కూడు, గుడూ, గుడ్డ లోటు లేకుండా నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించడేమ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిటిట్కో అధికారి అశోక్‌బాబు, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొఠారు సాంబ, టీడీపీ మున్సిపల్ అధ్యక్షులు ఆడారి శ్రీధర్, జిల్లా బిసి సంఘం ప్రధాన కార్యదర్శి మళ్ల కొండబాబు, కౌన్సిలర్లు మళ్ల శైలజ, బడ్డేడ చంద్రరావు, యల్లపు గోపి, పిట్లా శ్రీను, పడాల సూరిబాబు, బి.ఆదిశేషు, స్టేట్‌బ్యాంక్, ఆంధ్రబ్యాంక్, బరోడా బ్యాంక్, కేంద్ర సహకార బ్యాంకు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ వికాస బ్యాంకు మేనేజర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కవి సమయం

### దేవ దేవుని అవతరాలు- ప్రాముఖ్యత

మొదటి అవతారం : శ్రీ మన్నారాయణుని దివ్యరూపం
దానిని కేవలం పరమ యోగీంద్రులు మాత్రమే దర్శిస్తారు. ఆయన నాభి కమలం నుండి బ్రహ్మ జన్మించాడు. అతని అవయవాల్లో (బ్రహ్మ) లోకాలు కల్పింపబడ్డాయి.
రెండవ అవతారం : వరహావతారం : జగత్ సృష్టి కోసం పాతళంలోని భూమి నెత్తుతూ యచ్ఛేశుడై వరహారూపం ధరించాడు.
3వ అవతారం : నారదుడనే దేవర్షియై కర్మనిర్మోచకమయిన వైష్ణవతంత్రం చెప్పాడు.
4వ అవతారం : యీ అవతారం ధర్ముని పత్ని అయిన 'మూర్తి'కి నర నారాయణ మహర్షులుగా అవతరించారు.
5వ అవతారం : సిద్ధేశ్వరుడయిన కపిలుడు, అసురి అనే బ్రాహ్మణునకు, తత్వ సమూహాన్ని గురించి నిర్ణయం కల సాంఖ్యం ఉపదేశించాడు.
6వ అవతారం : అనసూయ యందు అత్రికి కుమారుడై అలర్కునికి, ప్రహ్లాదుడు మొ॥గు వారికి ఆత్మవిద్య బోధించాడు.
7వఅవతారంలో ఆకూతి యందు కుబికి జన్మించి యజ్ఞుడనే పేరుతో ప్రసిద్ధుడై దేవతలతో కలసి స్వాయంభువ మన్వంతరం రక్షించాడు.
8వ అవతారంలో మేరుదేవిని నాభికి జన్మించి ఉరుక్రిముడనే పేరుతో ప్రసిద్ధుడై విద్వాంసులకు పరమ హంస మార్గం ప్రకటించాడు.
9వ అవతారంలో మహర్షుల ప్రార్థనలతో పృధుచక్రవర్తియై భూమిని ధీనువుగా చేసే సమస్త వస్తువులు సిరికాడు.
10వ అవతారంలో సముద్రాన్ని మధించేటప్పుడు తాబేలు రూపం ధరించి, మంద ర పర్వతాన్ని నేర్పుగా తన వీపు మీద నిలిపారు.

...కవితా రచన
శ్రీస్వామి అప్పాజి భగవాన్
సెల్ నెం: 98486 44336


## పంచాంగం

మాసం : ఛైత్ర ; తిధి : త్రయోదశి ఉ.6.45; హస్త మ.1.38; రా.వ.9.39ల 11.16.

శనివారం 28-04-2018

a **మేషం** : స్త్రీలకు పనివారలతో ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. క్రయ విక్రయ రంగాలలోని వారికి నూతన ఉత్సాహం కానవస్తుంది. కాంట్రాక్టర్లకు అధికమైన ఒత్తిడి తప్పదు. వాహన విషయంలో సంతృప్తి కానవస్తుంది. స్థిరాస్తి క్రయ విక్రయాలకు సంబంధించి ప్రముఖులతో సంప్రదింపులు జరుపుతారు. b **వృషభం** : మీ కళత్ర మొండి వైఖరి, కుటుం బీకుల పట్టుదల మనశ్శాంతిని దూరం చేస్తాయి. ఇంటర్వ్యూలలో శ్రద్ధ వహిం చండి. విద్యార్థినులు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండాలి. విద్యార్థులు ఉన్నత విద్యల కోసం విదేశాలు వెళ్లేందుకు మార్గం సుగమవుతుంది. ఇతరుల ఆంతరంగిక విషయాలలో తలదూర్చకండి. C **మిథునం** : రావలసిన బకాయిల విషయంలో మెళుకువ అవసరం. సోదరీ, సోదరు లతో ఏకీభావం కుదరదు. ఐరన్, సిమెంట్, కలప రంగాలలో వారికి చికాకులు తప్పవు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం మంచిదని గమనించండి. లీజు, ఏజెన్సీ, నూతన కాంట్రాక్టులు అనుకూలిస్తాయి. స్నేహ పరిచయాలు విస్త రిస్తాయి. d **కర్కాటకం** : ఆహార వ్యవహారాలలో మెళుకువ వహించండి. ఉద్యోగస్తులకు పై అధికారుల నుంచి మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. మీ యత్నాలకు సన్నిహితుల ప్రోత్సాహం, సహకారం అందిస్తారు. ఖర్చులకు సరిపడు ఆదాయం సమకూర్చుకుంటారు. e **సింహం** : మీ ఆదాయానికి మించి ఖర్చులు అధికమవుతాయి. మీ సంతానం చదువుల్లో బాగా రాణిస్తారు. నిర్మాణ పథకాలలో పురోభివృద్ధి కానవస్తుంది. ఉద్యోగస్తులు తోటివారి కారణంగా అధికారులతో మాట పడవలసి వస్తుంది. షేర్ మార్కెట్ రంగాల వారికి సామాన్యం. పండ్లు, పూలు, కూరగాయల వ్యాపారస్తులుకు లాభదాయకం. f **కన్య** : లిటిగేషన్ వ్యవహా రాలలో జాగ్రత్త వహించండి. ధనం సమయానికి అందుట వలన సంతృప్తి కాన వస్తుంది. బంధుమిత్రులతో సంబంధ బాంధవ్యాలు బాగుగా ఉంటాయి. దైవ, పుణ్య, సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. విద్యార్థులు ఉన్నత విద్యల కోసం చేసే యత్నాలు అనుకూలిస్తాయి. ప్రయాణాలు అనుకూలిస్తాయి. g **తుల** : కందులు, ఎండుమిర్చి, స్టాకిస్టులు, వ్యాపారస్తులు సంతృప్తి కానవస్తుంది. రవాణా రంగాలలో వారికి మిశ్రమ ఫలితం కానవస్తుంది. రచయితలకు, పత్రికా రంగంలో వారికి కీర్తి, గౌరవాలు పెరుగుతాయి. ప్రేమానుబంధాలు బలపడతాయి. రాజకీయాల్లో వారికి తెలివితేటలకు మంచి గుర్తింపు లభిస్తుంది. h **వృశ్చికం** : కుటుంబీకుల నుంచి సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది. ఫ్యాన్సీ, సుగంధ ద్రవ్య, రసాయన వ్యాపారస్తులకు లాభదాయకం. ఉపాధ్యాయులు ఒత్తిడి సమస్యలకు లోనవుతారు. ఎదుటివారు మీకు సమఉజ్జీలేనని గ్రహించండి. గత అనుభవాలు జ్ఞప్తికి రాగలవు. రియల్ ఎస్టేట్ రంగాల వారికి నూతన వెంచర్లు అనుకూలిస్తాయి. i **ధనుస్సు** : స్త్రీలకు నూతన వ్యక్తుల పరిచయం ఎంతో ఇబ్బంది కలిగిస్తుంది. మార్కెటింగ్ రంగాల్లో వారికి, పత్రికా, ప్రైవేటు సంస్థల్లో వారికి మార్పులు అనుకూలిస్తాయి. ఊహించని ఖర్చులు వల్ల స్వల్ప ఇబ్బందులు తప్పవు. విద్యార్థులకు అతి ఉత్సాహం వల్ల సమస్యలు తలెత్తుతాయి. j **మకరం** : ఉపాధ్యాయులకు ఒక సమాచారం ఆసక్తి కలిగిస్తుంది. స్త్రీలు ప్రముఖుల సిఫార్సుతో దైవ దర్శనాలను త్వరగా ముగించుకుంటారు. నూతన అగ్రమెంట్లు వాయిదా వెయ్యండి. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. నిరుద్యోగులు భవిష్యత్ గురించి పథకాలు వేసిన సత్ఫలితాలు పొందుతారు. ఖర్చులు అధిక మవు తాయి. k **కుంభం** : ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. చేపట్టిన పనులు మంద కొడిగా సాగుతాయి. ప్రముఖులను కలుసుకొని బహుతమతులు అందజేస్తారు. రావలసిన డబ్బు చేతికి అందడం వల్ల ఆర్థిక ఇబ్బంది అంటూ ఉండదు. స్త్రీలు తేలికగా మోసపోయే ఆస్కారం కలదు. L **మీనం** : ఆర్థిక విష యాల్లో ఒకడుగు ముందుకు వేస్తారు. కాంట్రాక్టర్లకు అధికా రులతో అవగాహన కుదరదు. కోర్టు వ్యవహారాల్లో ఫ్లీడర్లకు, ఫ్లీడరు గుమస్తాలకు ఒడిదు డుకులు తప్పవు. కొంత మంది మీ సహాయం పొంది మిమ్మల్ని తక్కువ అంచనా వేయటం వల్ల ఆందోళనకకు గురవుతారు.

## పురాణాలలో స్త్రీ పురుష అంతర్భేద కథలు



భారత దేశంలో స్త్రీల పట్ల వివక్ష చూపిస్తారని ఒక అపవాదు ఉంది. కానీ మీరు చరిత్ర ని తిరగేస్తే ఇది నిజం కాదని స్పష్టమవుతుంది. పురాణాలలో ఈ సంప్రదాయానికి వ్యతిరేక ఉదాహరణలు బోలెడు కనిపిస్తాయి. అనేక సందర్భాలలో స్త్రీ పురుష తత్వాల మధ్య విభజన రేఖ అస్పష్టం గా ఉండటం మీకు కనపడుతుంది..పురాతన కవులు, రచయితలు ఈ స్త్రీ పురుష వివక్ష ని ధైర్యంగా తరచి చూసి ఒక్కోసారి మార్చడానికి కూడా ప్రయత్నించారు. మీ కర్మానుసారం మీరు ఆడ, మగ గానో, జంతువుగానో లేదా చెట్టుగానో పుడతారు. ఎలా పుట్టినా మృత్యు సమయం లో ఆత్మ జీర్ణ వస్త్రాన్ని విడిచిపెట్టినట్లు ఈ శరీరాన్ని వదిలి వెళ్ళిపోతుంది. అందుకే ఆత్మ స్త్రీ లేదా పురుష లింగం కాదు. ఇప్పుడు మనం హిందూ పురాణాలలో లింగ వివక్ష కి అందని కథలు చూద్దాము. ఈ కథలలో మగవారు ఆడవారి పాత్ర పోషించడానికి సిద్ధపడ్డ సంఘటనలు,మగవారు గా బ్రతికిన ఆడవారు,ఇంకా ఆడా మగా ఒకటే అని నిరూపించే కథలని చూద్దాము. ఇవి చదివి మీ భావాలని, కామెంట్లని దిగువ తెలియ చెయ్యడానికి సంకోచించకండి.

**అర్ధనారీశ్వరుడు:** అర్ధనారీశ్వర శబ్దానికి సగం స్త్రీ సగం పురుష తత్వం కలిగిన భగవంతుడని అర్ధం. మహా శివుడు మరియు ఆయన దేవేరి పార్వతి యొక్క ఏక రూపం ఈ అర్ధనారీశ్వరం. ఈ రూపం పురుష స్త్రీ తత్వాల ఏకీకరణకి ప్రతీక. ఒకళ్ళు లేకుండా ఇంకొకళ్ళు లేరూని, ఒకళ్ళు ఇంకొకళ్ళ కంటే ఎక్కువ కాదు అనీ, మరియు తనలో ఈ రెండు లక్షణాలనీ ఉంచుకున్నవాడే పరిపూర్ణ జీవితం గడపవచ్చనీ ఈ రూపం మనకి తెలియచేస్తుంది.

మోహిని శ్రీ మహా విష్ణువు అవతారం గా మోహినీ అవతారం మనకి హిందూ పురాణాలలో చాలా చోట్ల కనిపిస్తుంది. ఈ రూపాన్ని గురించి మూడు ముఖ్య కథలు చెప్తారు. మొదటిది సాగర మధనం తరువాత అమృతానికి సంబంధించిన తగవు తీర్చడానికి వచ్చిన రూపం. శ్రీ మహా విష్ణువు అందమైన మోహినీ రూపం ధరించి తెలివిగా అమృతాన్ని దేవతలకి మాత్రం పంచుతాడు. రెండోది పరమేశ్వరుణ్ణి భస్మాసురుడు అనే రాక్షసుడి బారి నుండీ కాపాడిన మోహినీ అవతారం.ఈ మనోహరమైన మోహినీ అవతారం భస్మాసురుడు తననను తాను అంతం చేసుకు నేటట్లు చేసింది. మనోహరమైన మోహినిని పరమేశ్వరుడు మోహించడం వల్ల అయ్యప్ప జననమయ్యింది. అయ్యప్ప దక్షిణ భారతం లో ప్రసిద్ధి చెందిన భగవత్ స్వరూపం. ఇంక మూడోది మహా భారతంలో. అర్జునుడి కొడుకైన అరవనుణ్ణి యుద్ధం లో పాండవుల విజయం కోసం బలి ఇవ్వ వలసి వస్తుంది.కానీ అరవణుడికి చనిపోయే ముందు వైవాహిక సుఖాలని అనుభవించాలని కోరిక ఉంటుంది.కానీ చావు రాసి పెట్టి ఉన్న ఈ మనిషి ని పెళ్ళాడేందుకు ఏ స్త్రీ ముందుకురాకపోయేసరికి శ్రీ కృష్ణుడే మోహిని గా మారి అరవనుణ్ణి పెళ్ళాడి అతను చనిపోయాకా దఃఖిస్తాడు.

శిఖండి ద్రుపద మహారాజుకి కుమార్తె గా పుట్టిన శిఖండి ని మగ పిల్లవాడిలాగ పెంచుతారు. కొన్ని కథల ప్రకారం శిఖండి కి అమ్మాయినిచ్చి పెళ్ళి చేసారుట కూడా. శిఖండి తన స్త్రీ తత్వాన్ని

### సంకీర్తన

తాను వైవాహిక జీవితం గడపడానికీ , భీష్ముడిని చంపటానికీ ఒక యక్షునికిచ్చినట్లు కూడా కొన్ని కథలు ప్రచారం లో ఉన్నాయి. చాలా కథల ద్వారా శిఖండి ఆడా ఉభయ లింగం అని తెలుస్తుం ది. బృహన్నల తనని తిరస్కరించాడన్న కోపం తో ఊర్వశి అర్జునుడిని ఒక సంవత్సరం స్త్రీగా మారతాడని శపిస్తుంది.కానీ ఈ శాపం అజ్ఞాతవాసం ఆఖరి సంవత్సరం లో విరాట మహారాజు కొలువులో బృహన్నల అనే స్త్రీలా ఉండటానికి ఒక వరంలా పనికొచ్చింది. కానీ కొంతమంది ఆ శాపం వల్ల అర్జునుడు స్త్రీగా కాకుండా నపుంసకుడిగా మారాడని కూడా అంటారు.

సుద్యుమ్న/ఇల పరమశివుడి తోట లోకి అనుమతి లేకుండా పొరపాటున ప్రవేశించడం వల్ల తన జీవితం లో సగ భాగం స్త్రీగా మారతాడని మగవాడిగా పుట్టిన సుద్యుమ్నుడికి శాపం వచ్చింది. అతను ప్రతీ నెలా తన తత్వాన్ని(లింగాన్ని) మార్చుకుంటుం డేవాడు. అతని స్త్రీ స్వరూపాన్ని ఇల గా వ్యవహరిస్తారు.




### నీటి కుంటలో

## భూగర్భ జలాల పెంపు

రావికమతం : జిల్లాలో ఎక్కువ శాతం వర్షాధార భూములు కావడంతో నీటి కుంటలు ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భ జలాలు పెంచుకోవచ్చునని కృషివిజ్ఞాన కేంద్రం విస్తరణ విభాగం అధికారి ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 2లక్షలకు పైగా హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగవుతుండగా రబీలో కేవలం 30 హెక్టార్లలో మాత్రమే పరిమిత పంటలు సాగవుతున్నాయన్నారు. దీనికి ప్రధాన కారణం సాగునీటి కొరత అని, ఈ నేపథ్యంలో వృధాగా పోతున్న నీటితో కుంటలు ఏర్పాటు చాలా అవసరమని చెప్పారు. ఈ నీటిని రబీలో పంటలతో పాటు పాల ఉత్పత్తి, పాడి పరిశ్రమను కూడా పెంచుకోవచ్చునన్నారు. పశుగ్రాస కొరతను కూడా అధిగహించవచ్చునన్నారు. అంతేకాదు నీటి కుంటల వల్ల భూగర్భ జలాలు పెరిగి భూమిలో నిత్యం తేమ ఉండటం వల్ల భూసారానికి నిత్యం తేమ ఉండటం వల్ల భూసారానికి కూడా ఢోకా ఉండదన్నారు. వీటి ఏర్పాటుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేస్తుందని, రైతులు ఫారంఫండ్‌లు ఏర్పాటు చేసుకోవడం ఎంతో ప్రయోజనమన్నారు.

## బట్టపనుకుల, నల్లగొండ పంచాయతీలకు అవార్డులు

కొయ్యూరు : మరుగుదొడ్ల నిర్మాణంలో పురోగతి సాధించిన నల్లగొండ, బట్టపనుకుల పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా పురస్కారాలను అందజేసినట్టు ఎంపిడిఒ ఇమ్మానుయేల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వారితో పాటు ప్రగతిని సాధించిన మండలాన్ని అభినందిస్తూ ఎంపిపి సత్యనారాయణకు అవార్డు ఇచ్చారన్నారు. ఉపాధి హామీలో ఉత్తమ ఇంజనీరింగ్ కన్సల్‌టెంట్(ఈసి)గా నాయక్‌కు అవార్డు లభించినట్టు చెప్పారు. అనంతరం తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గడువు లేనందున మరుగుదొడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. బిల్లుల చెల్లింపులో కొంత జాప్యం జరుగుతోందన్నారు.

## ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ 3వ వార్షికోత్సవం



విజయనగరం: స్థానిక ఫూల్ భాగ్ శ్రీలక్ష్మీగణపతి కాలనీలో గల శ్రీవల్లీ దేవసేన దేవాలయంలో వేంచేసియున్న 60 అడుగుల సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ 3వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం 5 గంటలనుంచి భక్తులు తండోపదండాలుగా, విచ్చేసి స్వామి వారిని సేవించారు. ప్రత్యేక పూజలతో, పుణ్యాహవచనం, నవగ్రహ హెూమం, సుబ్రహ్మణ్య హెూమం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి 60 అడు గుల స్వామి వారి విగ్రహానికి భక్తులచే పాలాభిషేకం అఖండ వైభ వంగా జరిపించారు. ఈ కార్యక్రమం ఆలయ ధర్మకర్త కర్రివేంకట రమణ సిద్ధాంతి ఆధ్వర్యంలో జరిగింది. ఈ హెూమానికి ప్రముఖ వ్యాపార వేత్తలు ఏగిరెడ్డి నారాయణరావు, నల్లబిల్లి సంజీవరెడ్డి దంపతులు హాజరైయ్యారు. ఆలయ అర్చకులు అగస్త్యశర్మ, శ్రీనివాసశర్మ, కమిటీ అధ్యక్షులు బేతా కృష్ణారావు, కార్యదర్శి శ్రీనివాసరావు, ధన్నాన రామ్మూర్తి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## జెడ్పీ పాఠశాలలోనే జూనియర్ కళాశాల

### డిప్యూటీ డిఇఒ సునీత



మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ సునీత

నాతవరం : ప్రస్తుతానికి నాత వరం జెడ్పీ పాఠశాలలోనే జూని యర్ కళాశాల ఏర్పాటు చేయడం జరుగుతుందని డిప్యూటీ డిఇఒ సునీత వెల్లడించారు. ఆమె పాఠశాల ఆవరణను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఇఒ సునీత మాట్లాడుతూ భవనాలు ఏర్పాటు అయ్యేంతవరకు పాఠశాల లోనే కళాశాల నిర్వహణ జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో నాతవరం నాయకులు అంకంరెడ్డి జమీలు, తాండవ జలాశయ చైర్మన్ పారుపల్లి కొండబాబు పాల్గొన్నారు.

## బాబామెట్ట దర్గాను సందర్శించిన చిన్నశ్రీను



విజయనగరం : పట్టణంలోని బాబామెట్ట ప్రాంతంలో గల సయ్యద్ హజరత్ బాబా ఉత్సవ సందర్భంగా శుక్రవారం వై.యస్సార్.సి.పి. జిల్లా రాజకీయ వ్యవహారాల సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చినశ్రీను) బాబా సమాధిని దర్శించారు. అతావుల్లా(చీమలపాడు) బాబా ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రమం తప్పకుండా అతావుల్లా బాబా నేతృత్వంలో ఆయన బక్తపరి వారం నిత్యాన్న దానం జరపడం గొప్ప విషయమని కొనియాడారు. సయ్యద్ హజరత్ బాబా దయతో సకల జనులు సంతోషంగా జీవించాలని అందుకు బాబా దయ ఉండాలని ఆయన ప్రార్థించారు. కలీల్ బాబా, మజ్జి శ్రీనివాసరావు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కాళ్ల గౌరిశంకర్, యువజన విభాగం నాయకుడు అవనాపు విక్రమ్‌లు బాబాకు చాదర్ సమర్పిం చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.ఎల్.ఎన్.రాజు, కనకల రఘురామారావు, పిన్నింటి చంద్రమౌళి, చందక రమణ, ఒమ్మి శ్రీను, పిలకా శ్రీను, ముల్లు త్రినాధ్, దాడి శ్రీను, కోరాడ తాతారావు, తోట మధు, మహంతి గణపతి, రెడ్డి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హజరత్ ఖాదర్ వలి గంధోత్సవం


### వేలాదిగా తరి వచ్చిన భక్త జనం

### ఆధ్యాంతం ... కళా జాతర... ఆహ్లాదకరంగా యాతర



విజయనగరం: స్థానిక బాబా బెట్టలో వేంచేసియున్న హజరత్ ఖాదర్ షా ఖాదర్ వలి బాబా (ర.అ) వారి 59వ గంధ మహెూత్సవం శుక్రవారం ఉదయం బాబా వారి చిత్రపట రథోత్సవంతో ప్రారంభమైంది. ఆద్యాంతం భక్తుల తాకిడితో బాబామెట్ట పులకించిపోయింది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు బాబా వారి చాదర్, గులాబీ పువ్వులతో భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఫకీర్ మేళ, నాగపూర్ నుంచి వచ్చిన ప్రత్యేకమైన బ్యాండ్ మేళాలతో..గుర్రాలతో, రాజస్థాన్ ఒంటెలతో ప్రత్యేక ఆకర్షణగా భక్తులను అలరించాయి. జానపద కళానృత్యాలతో... పులివేషాలతో బాబా వారి చిత్రపట ఊరేగింపు బయలు దేరింది. ముందుగా దర్గా సమీపించి అక్కడ నుంచి ఆబాద్ వీధి...మూడులాంతర్లు, గంటస్థంబం, రైల్వేస్టేషన్ రోడ్, బాలాజీ కూడలి , బొంకులదిబ్బ మీదుగా దాసన్న పేట నుంచి మరలా దర్గాకు చేరుకుంది. సుమారు 8 గంటలు పట్టే ఈ ఊరేగింపులో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## జేసిబితో పనులు ప్రారంభం



కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తున్న దృశ్యం

నర్సీపట్నం : నర్సీపట్నంలో నిర్మాణమౌతున్న హౌసింగ్ పథకం గృహ సముదాయంలో జేసిబి పనులకు నర్సీపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు కొబ్బరి కొట్టి ప్రారం భించారు.

ఈ సందర్భంగా సన్యాసి పాత్రుడు మాట్లాడుతూ పనులు వేగ వంతంగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, తహసీల్దార్ వి.వి.రమణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

### 37వ వార్డులో


## స్వచ్ఛభారత్ అవగాహన ర్యాలీ



కంచరపాలెం : జివిఎంసి 37వ వార్డు పరిధి జగజీవన్ నగర్ వద్ద శ్రీ మణి స్కూల్ విద్యార్థులు శుక్రవారం స్వచ్ఛ భారత్ అవగహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పరిసర ప్రాంత ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగహన కల్పించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిజేపి వార్డు సిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ బి.శివకుమార్, కార్యదర్శి డి.హరి, శ్రీ మణి స్కూల్ ప్రిన్స్ పాల్ రత్నం విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికే... మీతో.. మీ ఎస్పీ

### జిల్లా ఎస్పీ జి.పాలరాజు



విజయనగరం : మీతో మీ ఎస్పీ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు, తదుపరి ఫిర్యాదుల పరిష్కార వేదికను విజయనగరం జిల్లాపోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి.పాలరాజు నిర్వహించారు. మీతో-మీ ఎస్పీ కార్యక్రమంలో ప్రజల నుండి స్వయంగా జిల్లా ఎస్పీ ఆరు ఫిర్యాదులను స్వీకరించి, బాధితుల సమస్యలను ఫోనులో అడిగి తెలుసుకున్నారు. సమస్యలను విన్న ఎస్పీ, వాటిని పరిష్కరించేందుకుగాను వెంటనే చర్యలు కూడా చేపట్టారు. గంట్యాడ మండలం రామవరం గ్రామంలో ఫిర్యాది మోహనరావుకి 0.78 సెంట్ల మామిడితోట ఉన్నట్లు, సదరు తోటను విక్రయించేందుకు 2007 సంవత్సరంలో అప్పలరాజు అనే వ్యక్తికి పురోణి వ్రాసినట్లు, 2017 సంవత్సరం వరకు సదరు వ్యక్తి సదరు తోటను కొనుగోలు చేయలేనట్లు, ఇప్పుడు సదరు వ్యక్తి తోటపై తనకు పూర్తి హక్కులు కలవని, తోటను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నట్లు, న్యాయం చేయాల్సిందిగా ఫిర్యాదు చేసారు. ఈ ఫిర్యాదును పరిశీలించిన ఎస్పీ ఇరు వర్గాలువారు ఎటువంటి తగాదాలు పడకుండా బైండోవరు చెయ్యమని, వాస్తవాలను తనకు నివేదించాలని, సివిల్ తగాదా అయినందున కోర్టును ఆశ్రయించాల్సిందిగా ఫిర్యాదికి సూచించాలని గంట్యాడ ఎస్ఐను జిల్లా ఎస్పీ ఆదేశించారు. సాలూరు పట్టణానికి చెందిన నాగాబత్తుల అశోక్ కుమార్ అనే వ్యక్తి ఫిర్యాదు చేస్తూ తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ గతంలో సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి పాస్టర్ సుధాకర్ రాజరత్నం ఫిర్యాదు చేసారని, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ ఈ సంఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి, నివేదిక సమర్పించాల్సిందిగా ఎస్సీ, ఎస్టీ సెల్ డిఎస్పీ గురుమూర్తిని ఆదేశించారు. బొబ్బిలి పట్టణానికి చెందిన గంట పార్వతి ఫిర్యాదు చేస్తూ తాము నీళ్ళు తెచ్చుకొనే కొళాయి మార్గంలో తమ ఇంటికి దగ్గరలో ఉన్నవారు గోడ కట్టుటకు ప్రయత్నించినట్లు, ఈ స్థలం విషయమై ఇప్పటికే కోర్టులో కేసు నడుస్తున్నట్లు, ఫిర్యాది కుటుంబ సభ్యులను బెదిరిస్తున్నట్లు న్యాయం చెయ్యాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ పూర్తి స్థాయి విచారణ చేపాట్టాలని, వాస్తవాలను తనకు నివేదించాల్సింది, చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా బొబ్బిలి డిఎస్పీని ఆదేశించారు. బొబ్బిలి పట్టణానికి చెందిన పలపల సత్యన్నారాయణ ఫిర్యాదు చేస్తూ తమ ఇళ్లకు ఉమ్మడి రస్తాగా పూర్వం నుండి వాడుకుంటున్న రహదారిని గంటా పార్వతీ, వారి కుటుంబ సభ్యులు వ్యతిరేకిస్తూ, తమను రస్తాగా వినియోగించకుండా అడ్డుకుంటున్నారని, న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని, తగాదాకు కారణమైన రస్తాని సందర్శించి, వాస్తవాలను తనకు నివేదించాలని బొబ్బిలి డిఎస్పీని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌బ్రాంచ్ సిఐ వై.వి. శేషు పాల్గొన్నారు.

### మంత్రి లోకేష్‌కు సమస్యలు వివరించడంలో

## టీడీపీ నాయకులు పూర్తిగా విఫలమయ్యారు



విజయనగరం : జిల్లాలో పర్యటించిన రాష్ట్ర ఐ.టి., గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్ పర్యటన జిల్లా ప్రజలకు ఉపయోగ పడిందో లేదో కాని అధికార పార్టీ నేతలు మాత్రం ఆయన పర్యటనను సఫలీకృతం చేసుకున్నారని జిల్లా వై.యస్సార్.కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు(చినశ్రీను) అభిప్రాయపడ్డారు. శుక్రవారం స్థానిక సత్యాకార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. మాజీ కేంద్రమంత్రి మొదలు నాయకుల వరకు అంతా లోకేష్ భజనలో పడ్డారు తప్ప జిల్లాలో గల ప్రజాసమస్యలు ఆయన ముందు ఉంచలేకపోయారన్నారు. అందుకనే లోకేష్ తన పర్యటనలో అవగాహన లేకుండా మాట్లాడారని శ్రీనివాసరావు తెలిపారు. పార్వతీపురం డివిజన్‌లో ప్రజలకు మౌళిక సౌకర్యాలు కల్పిస్తామని, వచ్చే నెలలో ఇంటింటికి త్రాగునీరు అందిస్తామని ఏజెన్సీ ప్రాంతాలలో రోడ్లు నిర్మించామని మంత్రి పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందని ఆయన అన్నారు. ఏజన్సీ గిరిజన ప్రాంతాలలో రహదారులు లేక గిరిజనులు అనేక అవస్థలు పడుతూ గర్భిణీ స్త్రీలను, రోగులను మైదాన ప్రాంత ఆసుపత్రులకు డోలీలపై తెస్తున్న విషయాలతో పాటు ఇప్పటికీ ఆ ప్రాంత ప్రజలకు కనీస సౌకర్యాలు లేని దుస్థితిని తమ పార్టీ శాసన సభ్యురాలు పాముల పుష్పశ్రీవాణి శాసన సభలో ప్రస్తావించిన విషయాన్ని మంత్రి లోకేష్ మర్చిపోయారా? అని ఆయన ప్రశ్నించారు. వచ్చే నెలలో ఇంటింటికి త్రాగునీరు అందిస్తామని చెబుతున్న మంత్రి లోకేష్‌కు అవగాహన ఉందా అన్న సందేహం కల్గుతుందన్నారు. జిల్లాలో గ్రామీణ నీటి సరఫరా పథకాలు ఎన్ని ఉన్నాయి? జిల్లాలో గల గ్రామాలు సంఖ్య ఎంత? అన్నది కూడా సంబందిత మంత్రికి అవగాహన లేనప్పుడు అధికార యంత్రాంగమైనా ఆయనకు నివేదించ లేదా? నెల వ్యవదిలో ఇంటింటికి త్రాగునీరు ఇస్తామని మంత్రి ప్రకటించడం ఆశ్చర్యం ఉందన్నారు. గత ప్రభుత్వ పాలనలో మంజూరైన ఆర్.డబ్ల్యూ. యస్. పథకాలే మంత్రులు ప్రారంభిస్తున్నారు తప్ప ఈ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. జిల్లాలో బహిరంగ మలవిసర్జన రహితం ప్రదమ స్థానంలో ఉందని, స్వచ్ఛభారతికి కోట్ల రూపాయలు ఖర్చు అయిందని ప్రభుత్వం చెబుతుందని ఇందులో అధికారపార్టీ నేతల దోపిడీయే అధికంగా ఉందని శ్రీనివాసరావు ఆరోపించారు. జిల్లాలో అమలు జరుగుతున్న నీరు-చెట్టు, ఉపాధిహామీ పథకాలు అధికార పార్టీ నేతలకు ఫలహారాలుగా మారాయని ఆయన ఆరోపించారు. ఆపార్టీ నేతలకు ఇసుక దందాకు అంతులేకుండా పోయిందని అన్నారు. తన పార్టీ నేతల అవినీతి లోకేష్‌కు కనబడలేదా? అని నిలదీశారు. బొబ్బిలి రాజులు మొదలు, శృంగవరపుకోట, పూసపాటిరేగ మండలం కొళ్ళాయివలస తదితర ప్రాంతాలలో తన పార్టీ నేతలు ప్రభుత్వ భూములు దోపిడీ చేసిన విషయం మంత్రికి తెలియవా? జిల్లాలో గల ఉపాధిహామీ వేతనదారులకు చెల్లించవలసిన వేతనాలు వందకోట్లు పైబడి ఉన్నప్పటికి దీనిపై మంత్రి లోకేష్ మాట్లాడక పోవడం ఏమిటని? శ్రీనివాసరావు ప్రశ్నించారు. దేశం పార్టీ శాసనసభ్యులు మొదలు నేతల వరకు పొరుగు సేవలు, అంగన్‌వాడీ, ఆదర్శపాఠశాలలు, విద్యుత్ షిఫ్టు ఆపరేటర్లు వంటి ఉద్యోగాలు అమ్మకాలుకు పెట్టిన అవినీతి బాగోతం లోకేష్‌కు తెలియదా? అన్నారు. జిల్లా రిజిస్ట్రార్ సంస్థలో పదిసంవత్సరాలు నుండి పనిచేస్తున్న పొరుగు సేవల ఉద్యోగులను తొలిగించడం బావ్యమా? అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రస్థాయిలో అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రి లోకేష్ జిల్లాలో తన పార్టీ నాయకులకు దోపిడీ సందేశం ఇచ్చినట్లు ఉందని శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. జిల్లాలో జరుగుతున్న అవినీతి, దోపిడీ, భూ దందాలు వంటి అంశాలుపై వై.యస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే విచారణ జరిపిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలోఅంబళ్ల శ్రీరాములు నాయుడు, అవనాపు విక్రమ్, ఎం.ఎల్.ఎన్.రాజు, గాడు అప్పారావు, కేదారశెట్టి సీతారామమూర్తి, ముల్లు త్రినాధ్, పిలకా శ్రీను పాల్గొన్నారు.

## గర్భస్థ శిశులింగ నిర్ధారణ పరీక్షలు చట్ట విరుద్ధం



విశాఖపట్నం: గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్ట విరుద్ధమని ఇన్‌ఛార్జి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.వసుంధర తెలిపారు. రిజిష్టరు కాని అల్ట్రాస్కానింగ్ మిషన్స్‌ను వినియోగించి లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే కేంద్రాల నిర్వాహకులపై చట్టరీత్యా చర్యలు చేపడతామని ఆమె హెచ్చరించారు. శుక్రవారం డిఎంఅండ్ హెచ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఎడ్వజరీ కమిటీ సమావేశం మెడికల్ అండ్ హెల్త్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని కొన్ని మండలాలలో స్త్రీ, పురుష నిష్పత్తి బేధము అధికముగా ఉందని సదరు మండలాలలో స్క్వాడ్‌లతో ఆకస్మిక తనిఖీలను నిర్వహించాలన్నారు. ఈ విషయములో ఎన్‌జిఓలు, ఐకెపి, డ్వాక్రా మహిళల సహాయ సహకారాలను తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని వైద్యాధి కారులకు ఆమె సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.ఎన్.వసుంధర, ఎడ్వజరీ కమిటీ సభ్యులు, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాది . కారిడా.విజయలక్ష్మి,డెమోడా.సిహెచ్.శ్రీధర్‌తదితరులు పాల్గొన్నారు.

## ఏపీకి ప్రత్యేకహెూదా కోసమే వైకాపా పోరాటం



గాజువాక: ఏపీకి కేంద్రం ప్రత్యేకహెూదా ప్రకటించేవరకు వైకాపా పోరాటం ఆగదని రాష్ట్ర వైకాపా అధికార ప్రతినిధి కొయ్యప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గాజువాక వైకాపా కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల నాగిరెడ్డి ఆద్వర్యంలో జరిగిన ముఖ్యనేతల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వైకాపా ఆద్వర్యంలో ఈ నెల 30 వ తేదీని వంచన దినంగా పాటించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మే నెల 2వ తేదీ నుంచి జరుగు పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి ప్రత్యేక హెూదా తెచ్చేందుకు కార్యకర్తలు సన్నద్ధం కావాలని అన్నారు. ఏపీకి ప్రత్యేక హెూదా కోసం వైకాపా ఎన్ని పోరాటాలు చేసిన, చివరకు ఎం.పి పదవులకు రాజీనామా చేసిన కేంద్రం స్పందించకపోవడం దారుణమని అన్నారు. పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం ప్రజాస్వామ్యానికి పెద్ద ప్రమాదమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నేతలు వై.మస్తానప్ప, పిట్టారెడ్డి, ధర్మాల శ్రీను, మొల్లిచిన్న, దాడినూకరాజు, సన్ని, నక్కరమణబాబు, మదీనా భాషా, బేగం, శాయికుమారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాభిప్రాయానికే పెద్దపీట

## చినరాజప్ప



పెద్దాపురం : ప్రజల అభివృద్ధి సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పట్టణాభివృద్ధికి అన్ని పనులు చేయడం జరుగుచున్నదని రాష్ట్ర ఉపముఖ్య మంత్రి, హోంమంత్రి చినరాజప్ప అన్నారు. గురువారం ఉదయం స్థానిక మరిడమ్మ అమ్మ వారి దేవస్థానం ఎసి కల్యాణమండపం ప్రారంభోత్సవ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో రోడ్లు, ఆఫీసుభవనాలు, సెంట్రల్ లైటింగ్ మొదలగు అనేక అభివృద్ధి పనులు ప్రారంభించి పూర్తిచేయడం జరిగిందని డిసెంబర్ నాటికి పట్టణాన్ని పూర్తిస్థాయి సిటిగా తీర్చిదిద్ద గలనని అన్నారు. అయితే ఎమ్మార్వో, ఆర్డీవో భవనాల నిర్మాణాలకు కొంతమంది అడ్డుపడు తున్నారని అయితే ప్రజాభిప్రాయానికే పెద్దపీట వేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఇఒ పుష్పనాథం, ఎం శ్రీనివాస్, ఆత్మరాం, రంది సత్యనారాయణ, డిఎస్పి, సిహెచ్ రామారావు, సిఐ శ్రీనివాస్, ఎస్ఐ కృష్ణభగవాన్ భక్తులు హాజరైనారు.

## ఫెర్రీలో త్రాగునీటి సమస్య

యానాం : పర్యాటక ప్రాంతమైన రాజీవ్‌గాంధీ బీచ్‌లోని ఉన్న పలు కాలనీలకు త్రాగునీటి యద్దడి నెలకొంది. గత పదిరోజులుగా ఫెర్రీ రోడ్డులోని కొనా వెంకటరత్నం కాలనీ, వీరభద్రకాలనీలో త్రాగునీరు పైపులైన్‌ద్వారా రాకపోవడంతో మహిళలు దూరప్రాంతాలకు వెళ్ళి నీరు కొనుగోలు చేసుకుంటున్నారు. ఈ విషయంపై అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా నీరు రావడంలేదన్నారు. అంతంతమాత్రంగా పైపులైన్ ద్వారా నీరు వచ్చినప్పటికీ మోటార్లు ద్వారా నీరు తోడివేయడంతో నీరు దొరకని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు వాపోయారు. ఈ విషయంపై ప్రజాపనుల శాఖ ఇఇ ఎం. శ్రీనివాసును వివరణకోరగా పైపులైన్‌లు మరమ్మతులకు రావడంతో గత రెండురోజులగా మరమ్మతు చేపట్టామని శుక్రవారం నుండినీటిని సరఫరా చేస్తామని దీనిపై గ్రామస్తులు ఆందోళన చెంద వలసిన అవసరంలేదని పూర్తిస్థాయిలో సరఫరా చేస్తామన్నారు. ఏమైనా సమస్యలు ఉన్నా గ్రామస్తులు తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

# ఆయిల్ బంకులు మూసివేత

### - ఆయిల్ అధికారులు వేధింపులతో వినియోగదారుల తీవ్ర ఇక్కట్లు
### - సమస్యను పరిష్కరించాలని పరిపాలనాధికారికి ఫిర్యాదు

యానాం: కేంద్ర పాలిత ప్రాంతమైన యానాం నియోజకవర్గంలో ఆయిల్ బంక్‌లు స్టాక్ లేదంటూ బోర్డులు పెట్టి యాజమాన్యం మూసివేశారు. శుక్ర వారం వినియోగదారులు ఆయిల్ బంక్‌లలోకి వాహ నాలతో వెళ్ళగా అక్కడ నో స్టాక్ బోర్డు కనబడటంతో వినియోగదారులు అవక్కయ్యారు. యానాంలో ఉన్న సుమారు 12 బంక్‌లు ఇదే పరిస్థితి నెలకొనడంతో బంక్‌లవద్ద వాహనాలతో యాజమాన్యంపై వాగ్వా దానికి దిగుతూ ఆగ్రహం వ్యక్తంచేశారు. సుమారు 3 నెలలు నుండి పెట్రోల్ బంక్‌లకు అరకొరగా ట్యాంక్‌లు పంపడంవలన ఈ పరిస్థితులు తలెత్తడంతో పరిపాలనాధికారి దువులూరి సుబ్రమణ్యేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్ళారు. దీనిపై అధికారులతో మాట్లాడి నప్పటికీ పరిస్థితి యధావిధిగా సాగుతూ పదిరోజులుగా పెట్రోల్ బంక్‌లలో ఆయిల్ నిల్వలు అడుగంటి పోవడంతో బంక్‌లు మూసివేసి దారికి అడ్డంగా తాళ్ళుకట్టి నోస్టాక్ బోర్డు పెట్టారు. మూడు ఆయిల్ కంపెనీలు యానాం పెట్రోల్ బంక్‌లకు కోటా ప్రకారం ఆయిల్ సరఫరాచేయవలసి ఉన్నప్పటికీ సరఫరాచేయకపోవడంతో యాజమాన్యం ఏమీ చేయలేని పరిస్థితిలో బంక్‌లు మూసివేసినట్లు తెలుస్తుంది. ఈ విషయంపై ఆయిల్ కంపెనీల కోఆర్డినేటర్‌ను వివరణ కోరగా యానాంకు సంబంధించిన బంక్‌లకు తనకు సంబంధంలేదని తాను ఆంధ్రప్రదేశ్‌కు కోఆర్డినేటర్‌గా ఉన్నానని ఆ ప్రతినిధి తెలిపారు. వినియోగదారుల ఇక్కట్లుపై పరిపాలనాధికారిని వివరణకోరగా యానాంకు సంబంధించిన బంక్‌లపై ఆయిల్ కంపెనీల ప్రతినిధులు స్టాక్ సరఫరాచేయకుండా జాప్యం చేయడంవలన ఈ పరిస్థితి తలెత్తాయని దీనిపై పుదుచ్చేరి ఉన్నతాధికారులకు వివరించినట్లు తెలిపారు. యానాంలో లీటర్ పెట్రోల్, డీజల్‌కు సబ్సీడీతో సుమారు రూ. 7 లు వినియోగదారునికి లబ్ధిచేకురడంవలన యానాం పరిసరప్రాంతాల ప్రజలు యానాం వచ్చి పెట్రోల్ తీసుకువెళ్ళడం ఆయిల్‌కు మంచి గిరాకి ఉండటం దీనిని జీర్ణించుకోలేని తూర్పుగోదావరి జిల్లా ఆయిల్ బంక్‌ల యాజమాన్యంతో అయిల్ కంపెనీల ప్రతినిధులు కుమ్మక్కై ఈ వేధింపులకు దిగినట్లు ఈ ఘటనలు రుజువుచేస్తున్నాయని దీనికి స్వస్తిపలకకపోతే దీనిపై న్యాయపోరాటం చేస్తామని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏవైనా అవకతవకలు జరిగితే సంబంధితులపై చర్యలు చేపట్టాలని అలా కాకుండా స్టాకు సరఫరాచేయకుండా నిలపివేయడం ఎంతవరకు సబబుఅని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. ప్రాంతాలవారిగా వివక్షత చూపడం తగదన్నారు.

## సత్యదేవునికి ఎస్‌బిఐ వాటర్ కూలర్ బహుకరణ



అన్నవరం :తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివార్కి సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు వేసవి కాలము ఎండల తీవ్రత దృష్ట్యా వాటర్ కూలర్‌ను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఎసి బండారు. అనంతలక్ష్మి సత్యవతిదేవి, సూపరింటెండెంట్ శంకర్రావు పాల్గొన్నారు.




బయోమెడికల్ వేస్ట్‌మేనేజ్‌మెంట్‌పై జరుగుతున్న వర్క్‌షాపులో రెండవరోజున కెజిహెచ్ సూపరింటెండెంట్ ఆరోగ్యమే మహా భాగ్యం అనే అంశంపై ఉపన్యాసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు అందించబడుతున్న వైద్య సేవలను కొనియాడారు. మానవసేవయే మాధవ సేవగా భావించి పరిరక్షణా అనే ఎన్‌జిఒ అందిస్తున్న సేవలను అభినందించారు. ఈ వర్క్‌షాపు డాక్టర్ కె.ఎసెఎల్‌జి శాస్త్రి, డాక్టర్ కేసవరావు మరియు డాక్టర్ సిహెచ్ సాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్స్, అసోసియేట్స్, అసిస్టెంట్‌లు, పిజీలు, హౌస్ సర్జన్‌లు, నర్సులు, పారామెడికల్ మరియు నాల్గవతరగతి సిబ్బంది, కెజిహెచ్ అన్ని ప్రత్యేక విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## చెరువు పూడికతీత పనులు ప్రారంభం

తాళ్లరేవు : పంచాయతీ పరిధి పెంకేవారి పేటలో ఉన్న ఊరిచెరువులో ఉపాధి హామీ పథకంలో చేపట్టే పూడికతీత పనులను సర్పంచ్ వాసంసెట్టి శ్రీనివాసు ప్రారంభించారు. ఈ చెరువులో పూడిక తీయడానికి సుమారు రూ. 10 లక్షల అంచనాలతో ప్రతిపాదనలు పంపడంతో నిధులు మంజురుఅయ్యాయిని దీనితో పనులు ప్రారంభిస్తున్నట్లు ఉపాధిహామీ క్షేత్ర సహాయకుడు రెడ్డిరాంబాబు తెలిపారు. సుమారు 4 వేల పనిదినాలు ఈ చెరువు వల్ల లభిస్తాయాన్నారు. ఉపాధి హామీ పథకంలో జాబుకార్డు పొంది ప్రతిఒక్కరూ పనులు పొందాలని సర్పంచ్ సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇజెవి రమణ, ఉపాధి సాంకేతిక సహాయకరాలు సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సత్యదేవుని వివాహ హోమం

అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరి వాసుడైన శ్రీ సత్యదేవుడు, అనంత లక్ష్మి సత్యవతీదేవిల వివాహం అయిన సందర్భంగా శుక్రవారం ఘనంగా వివాహ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో ఎమ్.జితేంద్ర, ఛైర్మెన్ ఐవి.రోహిత్, ఎసి. ఈరంకి.జగన్నాధరావు తదితరులు పాల్గొన్నారు. హోమ కార్యక్రమాన్ని ప్రధాన అర్చకులు చల్లపల్లి.ప్రసాద్ శర్మ, చామర్తి.కన్నబాబు తదితరులు నిర్వహించారు.

## రైతులు మెళకువలు కలిగి పంట నష్టాన్ని నివారించేందుకు శిక్షణలు




కొత్తపేట:ఉద్యాన పంటలపై శిక్షణా కార్యక్రమాలు చేపట్టుట ద్వారా రైతులు మెలుకువ కల్గి పంట నష్టాన్ని నివారించుకొనవచ్చునని ఉద్యాన వనశాఖ ఏఓ ఎమ్.భబిత అన్నారు. శుక్రవారం గోపాలపురం పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ ఆనే లక్ష్మి ముసలయ్య అధ్యక్షతన జరిగిన శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా ఏఓ ఎమ్ భబిత, శాస్త్రవేత్తలు డా.శక్తివేల్, డా. బి.నరేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొప్పాయి, పసుపు, కోకో, వక్క పంటలకు ఉద్యానశాఖ ద్వారా యాంత్రీకరణ పరికరాలలో రాయితీని ఇస్తున్నామని దీనిని రైతులు అందరూ సద్వి వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ఉద్యానవన పంటలలో ఎక్కువగా ఎలుకలు ఉడుతలు నష్టాన్ని కలిగిస్తాయని వీటి నివారణకు తప్పనిసరిగా శాఖా పరమైన అధికారులు సలహాలు, సూచనలు పాటించినట్లయితే అధిక దిగుబడులు సాధించవచ్చునని వారన్నారు. జిల్లా టి.ఎన్.టి.యు.సి అధ్యక్షులు మైగాపుల గురవయ్య నాయుడు మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పధకాలు ప్రవేశపెట్టిందని వీటన్నిటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరిస్ ప్రతినిధి శ్రీనివాస్ నాయుడు, నెటాఫిమ్ డీలర్ శ్రీనివాస్, ఆసుపత్రి చైర్మన్ వానపల్లి త్రిమూర్తులు, ఎమ్.పి.ఈ.ఓలు వెంకటరత్నం, ప్రియాంక, వినోద్, షాలిని, బాబాయి, గోవింద్, మణికంత, నందని, రైతులు వైఎస్సార్ ఆంజనేయులు, మీసాల శ్రీను, మీసాల గంగాధర్, గుజాల నారాయణరావు, సలాది వెంకటేశ్వరరావు, వెలగల వెంకటరెడ్డి, పడాల నరసింహారెడ్డి పాల్గొన్నారు.

## పనుల పరిశీలన

కాకినాడ: కాకినాడ రూరల్ మండలం కొవ్వాడ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఘన వ్యర్థాల కేంద్రనిర్మాణ పనులను మండల ఎఇ శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు పూర్తి పారదర్శకతలో జరుగుతున్నాయన్నారు. పంచాయితీ నిధులు రూ. 5 లక్షలతో కేంద్రం చుట్టూ ప్రహరినిర్మించడం జరుగుతుందన్నారు. తడి పొడి చెత్తగా వేరు చేసేందుకు తొట్టెలు నిర్మించడం జరుగుతుందన్నారు. దీనితో సేంద్రీయ ఎరువులు తయారుచేసి బయటకు అమ్మడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పెంచ్, పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

## మాకవరపాలెం డీటీగా ప్రసన్నకుమార్



మాకవరపాలెం: మాకవరపాలెం మండలం డిప్యూటీ తహసీల్దార్‌గా కె.ప్రసన్న కుమార్ భాద్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శుక్రవారం కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తన వంతు చర్యలు తీసుకుంటామని వివరించారు. చోడవరంలో ఎలక్షన్ డీటీగా పనిచేసిన ఆయన డిప్యుటేషన్ పద్ధతిపై ఇక్కడి వచ్చినట్లు చెప్పారు.

## ఘనంగా వనదుర్గమ్మవారి ఆలయంలో చండీ హోమం

అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో వనదేవతగా పూజలు అందుకొంటున్న వనదుర్గమ్మవారి గుడిలో ఘనంగా చండీ హోమం నిర్వహించారు.ఉదయం 9గం.లకు విఘ్నేశ్వరుని పూజా, పుణ్యావచనం అమ్మవారికి ముల మంత్ర జపములు చండీ సప్తపతి పారాయణములు నిర్వహించారు.11గం.లకు పూర్ణహుతి గావించారు. అనంతరం సుగంధ ధ్రవ్యాలను ఆలయ ఈవో మారెడ్డి.జితేంద్ర హోమ గుండంలో వేసారు. పూజా కార్యక్రమాలను ప్రధాన అర్చకులు గాడేపల్లి.సత్యనారాయణ, చల్లపల్లి.ప్రసాద్ శర్మ ఆద్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎసి ఈరంకి.జగన్నాధరావు, టెంపుల్ ఇన్ స్పెక్టర్ పోల్నాటి. లక్ష్మినారాయణ, ఆలయ సిబ్బంది, గ్రామ ప్రజలు,భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్ధ, ప్రసాదాలు అందజేసారు.

## పూలే అంబేద్కర్ సంబరాలు విజయవంతం చేయండి

రావులపాలెం: స్వేచ్ఛ స్వాతంత్ర్యంలో పునాది వేసిన మహాత్మా జ్యోతిరావ్ పూలే, బాబాసాహెబ్ డా॥ బి.ఆర్.అంబేద్కర్ సంబరాలకు నియోజక వర్గ స్థాయిలో స్త్రీలు పాల్గొనాలని పూలే అంబేద్కర్ ఆశయ సాధన సమితి ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ మహిళల హక్కులో కోసం కేంద్రం మంత్రి పదవిని తృణప్రాయంగా త్యజించిన స్త్రీ దాస్య విమోచకుడు అంబేద్కర్ అని మహిళా విద్య కోసం విద్యాలయాలు స్థాపించి తన జీవిత భాగ స్వామినే ఆధునిక భారతదేశ మొట్టమొదటి ఉపాధ్యాయరాలుగా మహిళా సాధికారత కోసం తొలి అడుగు వేసిన మహెూన్నత వ్యక్తి జ్యోతిరావ్ పూలే అని వారు కొనియాడారు. అటువంటి మహనీయుల పేరిట సంబరాలు ఏర్పాటు చేసి ప్రత్యేకించి స్త్రీలకు పోటీలు నిర్వహించడం శుభపరిణామం అన్నారు. ఈ సంబరాలు ఏప్రిల్ 29, 30 తేదీల్లో నిర్వహించనున్నట్లు వారు తెలియజేశారు.ఈ సంబరాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారన్నారు. పూలే సంబరాలు ఈ నెల 29న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మామిడికుదురులో ప్రారంభం అవుతాయని అంబేద్కర్ సంబరాలు ఈ నెల 30 ఉదయం 7గం॥లకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అమలాపురం నందు రైల్వే డిఎస్పీ మోకా సత్తిబాబు ఆధ్వర్యంలో నిర్వహించబడతాయని వారు తెలియజేశారు.

# ఆక్వాకు గిట్టుబాటు ధర లభించేలా కృషి చేయాలి

### కోనసీమ ఆక్వా పరిరక్షణ సమితి నాయకుడు త్సవటపల్లి నాగభూషణం



అమలాపురం : ఆక్వా రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా ప్రభుత్వం కృషి చేయాలని కోనసీమ ఆక్వా పరిరక్షణ సమితి నాయకులు త్సవటపల్లి నాగభూషణం డిమాండ్ చేసారు. భీమవరం మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగిన తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల మత్స్యశాఖ అధికారులు, రొయ్యల ఎగుమతిదారులు, ఆక్వా రైతులతో సమావేశం జరిగిందని ఆయన అమలాపురంలోని పాత్రికేయులకు తెలిపారు. ఈ సమావేశానికి భీమవరం మార్కెట్ కమిటీ ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా మత్స్యశాఖ జేడీ డాక్టర్ అంజిలి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై నాయకులు త్సవటపల్లి నాగభూషణం మాట్లాడుతూ ప్రస్తుతం ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఇదే పరిస్థితి కొనసాగితే గుంటూరు జిల్లాలో పత్తి రైతులు ఆత్మహత్య ఘటనలు చోటు చేసుకుంటాయని ఆవేదన వ్యక్తం చేసారు. కోస్తా జిల్లాల్లో ఆక్వా సాగు ద్వారా ప్రభుత్వానికి రూ.37వేల కోట్లు ఆదాయం సమకూరుతుంటే రాష్ట్ర బడ్జెట్‌లో ఆక్వా రంగానికి కేవలం రూ.350కోట్లు కేటాయించడం దారుణమని అన్నారు. మత్స్యశాఖలో పనిచేస్తున్న అధికారులు ఆక్వా రంగం ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకపోగా, హేచరీస్, ఫీడ్, రొయ్యల మందులకు సంబంధించి పరిరక్షణ కరువైందని, దీని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. అంతేకాకుండా ఆక్వా రంగంలో ఉన్న దళారీ వ్యవస్థను నియంత్రించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఎద్దేవా చేసారు. ప్రభుత్వం స్పందించి ఆక్వా రైతులకు అత్యాధునికమైన లేబొరేటరీస్, సబ్సిడీలు అందించడమే కాకుండా ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాల్లో మార్కెట్ యార్డుల్లో కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కమిషనర్ స్థాయి అధికారి స్పందించి హామీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా ఎక్స్‌పోర్టర్స్‌ని రైతులు ప్రశ్నించగా, ధరలు హెచ్చుతగ్గులు ఏమీ లేవని విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్‌లో ప్రకటించిన ధరలకే ప్రస్తుతం కొనుగోలు చేస్తున్నామని స్పష్టం చేసారు. జగదీష్ మెరైన్ అండ్ ఎక్స్‌పోర్టర్ జగదీష్ మాట్లాడుతూ ధరల నియంత్రణలో ఎక్స్‌పోర్టర్ల లోపం ఏమీ లేదని, లోపమంతా దళారీలోనే ఉందని, ఈ విషయాన్ని రైతులు గ్రహించాలని అన్నారు. ఎక్స్‌పోర్టర్లు కూడా పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఉత్పత్తి ఎక్కువగా ఉండటం వల్ల ధరలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయని, రైతుల తరపునే పోరాటానికి సిద్దంగాఉన్నామని స్పష్టం చేసారు. ఈ సమావేశంలో ఆక్వా రైతులు యాళ్ల బ్రహ్మానందం, మోటూరి నాని, జేడీలు కోటేశ్వరరావు, ఫణిప్రకాష్‌తో పాటు ఎక్స్‌పోర్టర్లు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

## అక్రిడేషన్ కార్డుల ఎంపికలో అవకతవకలు

### - డిడి ఫ్రాన్సిస్ పైసలకు అమ్ముడుపోయాడా?
### - కార్డుకు రూ15వేలు లంచం ఇవ్వవల్సిందేనా?

కాకినాడ :తూర్పుగోదావరి జిల్లా డీపీఆర్వో కార్యాలయం లంచం మత్తులో మునిగాడుతుందా? ప్రతినిత్యం ప్రజలతో మమైకమవుతూ వారి కష్టాలను నష్టాలను తెలుసుకుంటూ ప్రజాధనానికి తూట్లు పొడుస్తూ అవినీతికి పాల్పడుతున్న వ్యవహారాలను ప్రాణాలను కుడా లెక్కచేయకుండా వెలికితీస్తూ శ్రమించే నిజమైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు మంజురూ చేయలేని పరిస్థితులలో డిడి ఫ్రాన్సిస్ ఉన్నారు జర్నలిస్టులకు గౌరవంగా లభించవలిసిన అక్రిడేషన్ కార్డులకు లంచం అనే గ్రహణం వీడదా? సమాజంలో మీడియా రంగం పట్ల ప్రభుత్వాలు ఎప్పుడూ చిన్న చూపునే ప్రదర్శిస్తున్నాయి పేరుకి మీడియా రంగ బాగోగులు చూసేందుకు ఒక శాఖ రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాలలో సమాచారశాఖ కార్యాలయాలు అధికారులు అబ్బో భారీ వ్యవస్థే ఉంది ఇదంతా కేవలం సమాచారాధికారులు వారి సంక్షేమానికే ఉపయోగపడే వ్యవస్థ నిజానికి వచ్చేసరికి పాత్రికేయుల సంక్షేమానికి ఈ సమాచారశాఖ వెలగబెట్టింది ఏమియు లేదు సామాజిక నైతిక బాధ్యత కలిగిన మహానుభావులు విలువలు కలిగిన జర్నలిస్టులు ఎందరో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పత్రికలలో పనిచేస్తున్నారు అలాంటి జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డుల విషయంలో తీరని అన్యాయం జరుగుతూనే ఉంది.

మొన్నటికి మొన్న పాత్రికేయులు, పాత్రికేయ సంఘాలు నిరాహారదీక్షలు చేసినా ఫలితం సూన్యం ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా ఈ వ్యవహారం పై నిఘా ఏర్పాటు చేసి అర్హులైనా జర్నలిస్టులకు న్యాయం చేయాలని పాత్రికేయులు, పత్రికసంస్థలు, పాత్రికేయ సంఘాలు, రాజకీయ నాయకులు సామాజికసంఘాలు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

## ప్రజల ఆరోగ్యానికి హానికలిగించే వ్యాపారాలు చేస్తే

# కఠిన చర్యలు

### అనధికార, కల్తీ వ్యాపారులపై విజిలెన్స్ ఉక్కుపాదం

### నివాస గృహాల్లో వ్యాపార స్టాక్ పాయింట్లపై సమాచారమందించాలి

### విజిలెన్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కోటేశ్వరరావు



విశాఖ క్రైం : నాణ్యత లేని వస్తువులను ప్రజలకు విక్రయించి వారి ప్రాణాలతో చెలగాటమాడితే సహించేది లేదని విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ ఎస్పీ డి.కోటేశ్వరరావు స్పష్టం చేశారు. తమ శాఖలో నిర్వహిస్తున్న దాడుల్లో అనేక మందిని గుర్తించామని అన్నారు. ఇకపై ఇటువంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. ప్రజలు కూడా మార్కెట్ లేదా షాప్స్‌లో కొనుగోలు చేస్తున్న వస్తువులపై తయారీ తేదిని గమనించి వస్తువులు కొనుగోలు చేయాలని విశాఖపట్నం విజిలెన్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ డి. కోటేశ్వరరావు హెచ్చరించారు.

మాధవధార వుడా కాలనీలో సూర్యకుమారి ఏజెన్సీ, శివాజీపాలెం పార్కు ఏదురుగా ఉన్న వెంకటప్పయ్య ఏజెన్సీ, మధురవాడ అమృతవర్షిణి ఫుడ్ ప్రొడెక్ట్‌పై మెరుపుదాడులు నిర్వహించి లక్షలాది రూపాయల నాణ్యత లేని 17 వేల గోధుమ పిండి ప్యాకెట్లు , 5 కేసుల విశాఖ డైరీ టెట్రా పాల ప్యాకెట్లు , 76 వేల శీతల పానీయ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. కాలం చెల్లిన నిత్యవసర వస్తువులను తిరిగి సొంత బ్రాండ్స్ పేరిట ప్యాక్ చేసి అమ్ముతున్నట్లు ఆరోపణలు ఉన్నాయని దినిపై న్యాయపరమైన చర్యలు చెపడతామన్నారు . నిర్వహకుడు ప్రభాకర్ పై కెసునమోదు చేశామన్నారు .



అనధికారికంగా వ్యాపార లావాదేవీలు సాగించినా, కల్తీ వ్యాపారాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినా వారిని ఉపేక్షించేది లేదని, ఎంతటివారినైనా చట్టం ముందు దోషులుగా నిలబెడతామని ఆయన అన్నారు. అలాగే, నివాస గృహాల్లో అనధికార వ్యాపార స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లయితే గృహయజమానులు గుర్తించి వెంటనే సమాచారాన్ని సంబంధిత అదికాలకు అందించాలన్నారు.

ఒకే రోజు మూడు చోట్లలో జరిగిన ఈ విజిలెన్స్ దాడులలో ఎస్పీ డి. కోటేశ్వరరావుతో పాటు డీఎస్పీ సీ.ఎం. నాయుడు, డిటిసిఓ పైలా రేవతి, సిఐలు శ్రీనివాసరావు, మల్లిఖార్జున్, ఎస్ఐ ఎస్. రమేష్, ఎంఆర్ఓ సుమబాల, ఫుడ్ కంట్రోల్ అధికారి కోటేశ్వరరావు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## సివిల్స్ పరీక్షలో తెలుగు కుర్రాడే టాపర్

దిల్లీ: సివిల్ సర్వీస్ పరీక్ష -2017 తుది ఫలితాలను యూపీఎస్సీ శుక్రవారం సాయంత్రం విడుదల చేసింది. గతేడాది అక్టోబర్- నవంబర్ మధ్య నిర్వహించిన ఈ పరీక్షల ఫలితాల్లో తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన అనుదీప్ దురిశెట్టి తొలి స్థానంలో నిలిచి తెలుగు కీర్తిపతాకాన్ని ఎగురవేశాడు. ఇక రెండో స్థానంలో అను కుమారి, మూడో స్థానంలో సచిన్‌గుప్తాలు నిలిచారు. గతేడాది అక్టోబర్ 28న యూపీఎస్సీ మెయిన్ పరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ మధ్య మౌఖిక పరీక్షలు నిర్వహించి మొత్తం 990 మంది పేర్లను ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్‌తో పాటు గ్రూప్-ఎ, గ్రూప్-బి ఉద్యోగాలకు యూపీఎస్సీ ఎంపికచేసింది. ఈ పరీక్ష ఫలితాలను అభ్యర్థులు తమ అధికారిక వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని యూపీఎస్సీ వెల్లడించింది.

**సత్తా చాటిన తెలుగు అభ్యర్థులు- సాధించిన ర్యాంకులు**

శీలం సాయి - 43, నారపురెడ్డి మౌర్య - 100, జి. మాధురి - 144
యెడవల్లి అక్షయ్ కుమార్ - 624, వివేక్ జాన్సన్- 195
సాయి ప్రణీత్ - 196 (సీబీఐ పూర్వజేడీ లక్ష్మీనారాయణ కుమారుడు)
భార్గవ శేఖర్ - 816 (అనంతపురం జిల్లా సోమవారవాండ్లపల్లి)

## కనీస వేతన చట్టం

# అమలు చేయాలి

### బ్రాండిక్స్ పరిశ్రమలో పర్యటించిన ఐటి మంత్రి నారా లోకేష్



అచ్యుతాపురం: బ్రాండిక్స్ కంపెనీలో కనీస వేతన చట్టం అమలు చేయాలని పంచాయితీరాజ్, ఐటి శాఖా మంత్రి నారా లోకేష్ అన్నారు. శుక్రవారం బ్రాండిక్స్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు కంపెనీ అమలు చేస్తున్న సదుపాయాలు, వేతనాలు గురించి అడిగి తెలుసుకున్నారు. కంపెనీ పని తీరును అభినందించారు. కార్మికులకు ఈ నెల నుండి 500 రూపాయలు పెంచాలని కోరగా అందుకు యాజమాన్యం అంగీకరించింది. భారతదేశంలో బ్రాండిక్స్ అపేరల్ పరిశ్రమ మొదటి స్థానంలో ఉందన్నారు. బ్రాండిక్స్‌లో ప్రస్థుతం ఉన్న 18,000లో 17,000ల మంది మహిళా కార్మికులు ఉండటం గర్వకారణమన్నారు. ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చినపుడే మహిళలకు స్వాతంత్ర్యం వచ్చినట్లౌతుందన్నారు.

ఈ సంఖ్యను రానున్న 2 సంవత్సరాల్లో 35 వేలకు పెంచాలన్నారు. సెజ్‌లో గల పరిశ్రమలకు కార్మికులు రావటానికి ఇబ్బంది లేకుండా అచ్యుతాపురంలో ఫ్లై-ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అలాగే కార్మికులకు ఇ.ఎస్.ఐ ఆసుపత్రి, వసతి సదుపాయం కల్పించాలని ఆయన కోరారు. ప్రభుత్వం నుండి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఎలక్ట్రికల్, అపెరల్ పార్క్‌లోనే ఉపాది అవకాసాలు ఎక్కువగా ఉంటాయన్నారు. తను మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత అధిక సంఖ్యలో పరిశ్రమలు రావటానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రత్యేక హొదా, రైల్వేజోన్ గురించి మోదిని అడగ వల్సింది పోయి, ముఖ్యమంత్రిని జగన్ మోహన్‌రెడ్డి విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. నిర్మలా సీతారామన్, సురేష్ ప్రభును రాష్ట్రం నుండి రాజ్య సభకు పంపినా రాష్ట్రనికి ఏమీ చేయలేదన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష మంది కార్మికులు పనిచేసే పరిశ్రమను స్థాపించటానికి కృషి చేస్తున్నట్టు అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్ఎల్ఎ పంచకర్ల రమేష్‌బాబు, అనకాపల్లి ఎమ్ఎల్ఎ పీలా గోవింద సత్యనారాయణ, పాయకరావుపేట ఎమ్ఎల్ఎ అనిత, జెడ్పి చైర్‌పర్సన్ లాలం భవాని, బ్రాండిక్స్ ఇండియా పార్టనర్ దొరస్వామి, తెలుగుదేశం సీనియర్ నాయకులు లాలం బాస్కర్రావు, తెలుగుదేశం నాయకురాలు డా॥ కాండ్రేగుల సత్యవతి, ఎమ్‌పిపి రాజాన రమేష్ కుమార్, జెడ్‌పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, మండల టిడిపి నాయకులు జనపరెడ్డి నరసింగరావు, అచ్యుతాపురం సర్పంచ్ ద్వారపురెడ్డి వెంకటలక్ష్మి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గీతం దంత వైద్యకళాశాల పట్టభద్రుల దినోత్సవం

### 140మంది వైద్యులుగా స్నాతకోత్తర పట్టాలు




సాగర్‌నగర్ : గీతం దంత వైద్యకళాశాల ఆసుపత్రి ద్వారా దంత వైద్యంలో బిడిఎస్, మరియు ఎమ్‌డిఎస్ కోర్సులు పూర్తి చేసిన వారికి శుక్రవారం 12వ పట్టభద్రుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మొత్తం 140 మంది దంత వైద్యులుగా స్నాతకోత్తర పట్టాలను అందుకున్నారు. కార్యక్రమానికి హాజరయిన గీతం అధ్యక్షడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి సభ్యుడు డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్.మూర్తి పట్టభద్రులను ఉద్దేశించి ప్రసంగిస్తూ దంతవైద్యులు 'గ్రామీణ ప్రాంతాలకు సేవలను విస్తరించాలని ముఖ్యంగా ప్రతి మండలంలో ఉండే ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలలో దంతవైద్యులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.నోటి ఆరోగ్యం ద్వారా శరీరంలోని వివిధ అవయవాలకు రుగ్మతలు రాకుండా చూడవచ్చునన్నారు. దంత సమస్యలకు గుండెకు సంబంధం ఉందనేది పలువురు పరిశోధకులు వెల్లడించిన విషయాన్ని ఆయిన గుర్తుచేశారు.ప్రతిఫలాపేక్ష లేకుండా వైద్యాన్ని సామాన్యులకు చేరడానికి కొత్తగా వృత్తిలోకి ప్రవేస్తున్న వారు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మద్రాస్ విశ్వవిద్యాలయం మాజీ వైస్‌ఛాన్సలర్, శ్రీ రామచంద్రా వైద్యకళాశాల పరిశోధనా విభాగం డీన్ ప్రొఫెసర్ ఎస్.పి.త్యాగరాజన్ మాట్లాడుతూ గడిచిన రెండు దశాబ్దాలలో దేశంలో దంత వైద్యకళాశాలల సంఖ్య గణనీయంగా పెరిగిందని అయితే బిడిఎస్ తో సమానంగా ఎమ్‌డిఎస్ సీట్లు పెరగాల్స ఉందన్నారు. దంత వైద్యంలో ఫోరెన్సిక్ డెంటిస్ట్రీ , డెంటల్ ఎథిక్స్ వంటి కోర్సులు ప్రారంభించాలని సూచించారు. భారతదేశంలో వైద్య విద్యా అధికంగా సిద్దాంత రూపంలో ఉందని వైద్య విద్యను అభ్యసించేవారికి ప్రాక్టికల్ అనుభవం ఎక్కువగా ఉండేలా కోర్సులలో మార్పులు చేయాలన్నారు. విదేశీ విశ్వవిద్యాలయాలలో సంబంధాలను పెంచుకోవడం ద్వారా అంతర్జాతీయ మార్పులకు అనుగుణంగా దేశంలో వైద్య విద్యను పటిష్ఠం చేసుకోగలమన్నారు.

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్.ఎస్.ప్రసాదరావు మాట్లాడుతూ నోటి ఆరోగ్యం పట్ల ప్రజలలో అవగాహనకు మొబైల్ డెంటల్ క్లీనిక్‌ల ఏర్పాటు అవసరమన్నారు. పొగాకు వాడకం, ఆహరపు అలవాట్లలో వచ్చిన మార్పుల వల్ల దంతసమస్యలు తల ఎత్తుతున్నాయని తెలిపారు.

గీతం దంత వైద్యకళాశాల ఆస్పత్రి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.గంగాధర ప్రసాద్ మాట్లాడుతూ గత 12 సంవత్సరాలలో వెయ్యిమందికి పైగా దంతవైద్యులను సమాజానికి అందించిన ఘనత సాధించామన్నారు. 2001 సంవత్సరంలో 40 మంది విద్యార్థులతో ప్రారంభం అయిన తమకళాశాల నేడు 100 మంది బిడిఎస్ విద్యార్థులకు 40 మంది ఎమ్‌డిఎస్ విద్యార్థులకు ఏటా ప్రవేశం కల్పించే స్థాయికి ఎదిగిందన్నారు. ఎనిమిది స్పెషలైజేషన్లలో పి.జి కోర్సులు నిర్వహిస్తున్నామన్నారు. రానున్న సంవత్సరాలలో పలు అధునాతన సధుపాయాలను దంత వైద్యకళాశాలలో ఏర్పాటు చేయినున్నట్లు వెల్లడించారు.

కార్యక్రమంలో గీతం దంత వైద్యకళాశాల ఆస్పత్రి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి. ప్రభాకరరావు, డాక్టర్ వై. రవిశంకర్ ,గీతం పాలక మండలి సభ్యులు బి.వి.మోహనరావు,హమ్జా మెహది, ప్రో-వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎమ్. పోతరాజు తదితరులు పాల్గొన్నారు.



**బంగారు పతక గ్రహీతలు:**

దంత వైద్య విద్యలోని పలు విభాగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పట్టభద్రుల దినోత్సవంలో బంగారు పతకాలను అందజేశారు.బిడిఎస్ కోర్సులో మైక్రోబయాలజీ, పాథాలజీ విభాగాలలో అత్యధిక మార్కులు సాధించిన ఎ.ఝాన్సీకి దూసి మోహనరావు పేరిట నెలకోల్పిన బంగారు పతకాన్ని అందజేయిగా, జనరల్ మెడిసిన్ విభాగంలో అత్యధిక మార్కులు సాధించిన శ్రీజత గంటా కు డాక్టర్ ఆర్.వి.నాయిక్ పేరిట నెలకొల్పిన బంగారు పతకాన్ని అందించారు.జనరల్ సర్జరీ విభాగంలో వి.మోనికాకు డాక్టర్ కె.వేణుగోపాల రావు బంగారుపతకాన్ని అన్ని విభాగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్. నిధితకు గీతం అద్యక్షుడు డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్.మూర్తి పేరిట నెలకొల్పిన బంగారు పతకాన్ని అందజేశారు .

# తగ్గిన పసిడి ధర

దిల్లీ: పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో ఇటీవల బంగారం ధర బాగా పెరిగింది. కాగా అంతర్జాతీయంగా బలహీన సంకేతాలతో నేటి బులియన్ మార్కెట్లో పసిడి ధర పడిపోయింది. స్థానిక నగల వ్యాపారుల నుంచి కూడా డిమాండ్ తగ్గినట్లు మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి. నేడు పది గ్రాముల మేలిమి బంగారం ధర రూ.190 తగ్గి రూ.32,210గా ఉంది. వెండి కూడా ఇదే బాటలో పయనించింది. కేజీ వెండి ధర రూ.100 తగ్గి రూ.40,450గా ఉంది. పారిశ్రామిక అవసరాలకు, నాణేల తయారీకి కూడా డిమాండ్ తగ్గినట్లు తెలుస్తోంది. రూపాయి మారం విలువ బలహీన పడి డాలరు విలువ పెరగడం కూడా ఇందుకు కారణమని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా బంగారం, వెండి ధరలు తగ్గాయి. న్యూయార్క్ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 0.48శాతం తగ్గి 1316.30డాలర్లుగా ఉంది. ఔన్సు వెండి ధర 0.27శాతం తగ్గి 16.47 డాలర్లుగా ఉంది.






Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published from ANH Apartments, Block-A, Flat No. 508, Bazar Ghat, Red Hills, Hyderabad-500 004. and printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003. R.N.I. No. 37754/81. Postal Regd. No. H-HD-1017/2006-08, Phone : 040 23370933, Fax : 040 66770933, Cell: 9701529570 e-mail: vijayabhanudaily@gmail.com

# చిత్రభాను

## ఆచారి అమెరికా యాత్ర రివ్యూ



గత కొంతకాలంగా మంచు విష్ణుకు సరైన హిట్లు లేవు. ఆఖరిగా 'గాయత్రి' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చినా ఆ సినిమాలో ఆయన అతిథి పాత్రలో నటించారు. ఇప్పుడు 'ఆచారి అమెరికా యాత్ర' అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చారు. గతంలో 'దేనికైనా రెడీ' చిత్రంలో పూజారి పాత్రలో మంచు విష్ణు నటించారు. ఇందులో విష్ణు, బ్రహ్మానందం పండించిన కామెడీ ప్రేక్షకులని పొట్టచెక్కలయ్యేలా నవ్వించింది. 'ఢీ' సినిమా నుంచి విష్ణు, బ్రహ్మానందం కాంబినేషన్ ఎప్పుడూ హిట్టే. ఇప్పుడు ఈ సినిమాలో ఇద్దరూ పంతుళ్ల పాత్రలో నటించారు. మరి ఈ పంతుళ్లకు అమెరికాకు సంబంధం ఏంటి? ఆచారి చేసిన అమెరికా యాత్ర సఫలమైందా? చూద్దాం.

కథేంటంటే: అప్పలాచార్య (బ్రహ్మానందం), తోటి అర్చక బ ృందంతో కలిసి హోమాలు, వ్రతాలు జరుపుతుంటాడు క ృష్ణమాచార్య(మంచు విష్ణు). ఒక పెద్దాయన(కోట శ్రీనివాస్‌రావు) ఇంట్లో హోమం చేస్తుండగా అమెరికా నుంచి వచ్చిన రేణుక(ప్రగ్యా జైశ్వాల్)ను చూసి మనసు పారేసుకుంటాడు ఆచార్య. ఇంతలో హోమం వద్ద చోటుచేసుకున్న ఓ సంఘటనతో అర్చక బ ృందం అపాయంలో పడుతుంది. ప్రాణాలు కాపాడుకునేందుకు క ృష్ణమాచార్య తన గురువు అప్పలాచార్యను ఒప్పించి అమెరికాకు బయలుదేరతాడు. మరి అక్కడికి వెళ్లాక ఏం జరిగింది? అర్చక బ ృందం అపాయంలో పడటానికి కారణం ఏంటి? క ృష్ణమాచార్య, రేణుక ప్రేమ ఫలించిందా? లేదా? తదితర విషయాలను తెరపై చూడాలి.

ఎలా ఉందంటే: నవ్వులు పండేందుకు అనువైన కథ ఇది. కానీ అందుకు తగ్గ కసరత్తులే జరగలేదు. దాంతో అక్కడక్కడా కాసిన్ని నవ్వులకి పరిమితమైన సాదాసీదా చిత్రంగా మిగిలిపోతుంది. కథ, కథనాల పరంగా కూడా లాజిక్‌లను పట్టించుకోకుండా చిత్రాన్ని తీర్చిదిద్దాడు దర్శకుడు. దాంతో అటు కథ కోణంలో కానీ ఇటు హాస్యం పరంగా కానీ సినిమా ఏమాత్రం ప్రభావం చూపదు. ఆరంభ సన్నివేశాలు మామూలుగానే మొదలైనా ఆచారి యాత్ర అమెరికాకు చేరుకున్నాకే నవ్వులు షురూ అవుతాయి. బ్రహ్మానందం, సత్య క ృష్ణన్‌ల కామెడీ ట్రాక్‌లతో పాటు విష్ణు, బ్రహ్మానందం, ప్రభాస్ శ్రీను, ప్రవీణ్ తదితరులు చేసే సందడితో సన్నివేశాలు పరుగుపెడతాయి. ఆచారి బ ృందం అమెరికాలో ఉందని తెలిశాక వాళ్లను వెంటాడేందుకు ప్రతినాయక బ ృందం బయలుదేరుతుంది. అక్కడి నుంచి ద్వితీయార్థం మొదలవుతుంది. రేణుకకి తన వాళ్లతోనే పొంచి ఉన్న ముప్పు నుంచి క ృష్ణమాచార్య తన తెలివి తేటలతో కాపాడే విధానం..దేశం కాని దేశంలో ప్రతినాయకుడి నుంచి తప్పించుకునేందుకు ఆచార్య బ ృందం పడే ఆపసోపాలు నవ్వులు పంచుతాయి. ప్రథమార్థంతో పోలిస్తే ద్వితీయార్థంలో కామెడీ బాగా తగ్గినట్లు అనిపిస్తుంది. ప ృథ్వీతో పాటు మరికొన్ని కొత్త పాత్రలు తెరపైకి వచ్చినా నవ్వులు మాత్రం పండవు. పతాక సన్నివేశాలు కూడా పెద్దగా ఆసక్తి కలిగించకుండానే ముగుస్తాయి.

ఎవరెలా చేశారంటే: ఇది వరకు చేసిన పాత్రలే అయినా బ్రహ్మానందం, విష్ణు పంతుళ్లుగా చేసిన సందడి ఆకట్టుకుంటుంది. వాళ్ల హావభావాలు మాటతీరు, చక్కటి వినోదాన్ని పంచాయి. ప్రగ్యా జైశ్వాల్ అందంగా కన్పించారు. పోసాని క ృష్ణమురళి, ప ృథ్వీ, సురేఖా వాణి, సత్య క ృష్ణన్,



ప్రవీణ్, ప్రభాస్ శ్రీను తదితరులు పాత్రల పరిధి మేరకు ఆకట్టుకున్నారు. ప్రదీప్ రావత్, ఠాకూర్ అనూప్ సింగ్ ప్రతినాయక పాత్రల్లో పరిధి మేరకు అలరించారు. సాంకేతికంగా సినిమా బాగుంది. సిద్ధార్థ్ కెమెరా అటు అమెరికా అందాలను, ఇటు భారత్ అందాలను చక్కగా చూపించింది. తమన్ పాటలు బాగున్నాయి. 'ఎంత సక్కగుడున్నాడో శ్రీనివాసుడు..' పాటతో పాటు చిత్రణ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. నిర్మాణ విలువలు బాగున్నాయి. దర్శకుడు నాగేశ్వరరెడ్డి తనకి కామెడీ పైన మంచి పట్టు ఉన్నప్పటికీ ఈ సినిమాలో ఆ ప్రభావం పెద్దగా కన్పించలేదు.

## కణం -రివ్యూ



హారర్ జోనర్‌లో సినిమాలు తీయడంలో ఒక్కో దర్శకుడిది ఒక్కో శైలి. ఒకరు భయంతో నవ్వులు పూయిస్తే, మరొకరు అదే భయానికి కాస్త సందేశాన్ని, మరికాస్త సెంటిమెంట్‌ను ఇంకాస్త ఎమోషన్‌ను కూడా జోడిస్తారు. రెండో కోవకు చెందిన దర్శకుడే ఏఎల్ విజయ్. గతంలో ఆయన తెరకెక్కించిన చిత్రాలు చూస్తే అది మనకు అర్థమవుతుంది. తాజాగా మరో విభిన్న కథాంశంతో తమిళంలో తెరకెక్కించిన చిత్రం 'దియా' తెలుగులో 'కణం' పేరుతో ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఇందులో యువ కథానాయకుడు నాగశౌర్య, తెలుగువారికి బాగా దగ్గరైన సాయిపల్లవి జంటగా నటించడం విశేషం. మరి ఏఎల్ విజయ్ తెరకెక్కించిన ఈ సినిమా ఎలా ఉంది? నాగశౌర్య, సాయిపల్లవి ఏ మేరకు ఆకట్టుకున్నారు? అసలు 'కణం' కథేంటి?

కథేంటంటే: క ృష్ణ(నాగశౌర్య), తులసి(సాయిపల్లవి) చదువుకుంటున్నప్పుడే ప్రేమించుకుంటారు. పెళ్లికి ముందే తొందరపడతారు. దీంతో తులసికి గర్భం వస్తుంది. ఆ వయసులో పెళ్లి చేయడం ఇరు కుటుంబాలకు ఇష్టం ఉండదు. దీంతో తులసిని బలవంతం చేసి అబార్షన్ చేయిస్తారు. అందుకు క ృష్ణ కూడా ఒప్పుకొంటాడు. అయిదేళ్ల పాటు అటు క ృష్ణని, ఇటు తులసిని కలవకుండా ఉంచుతారు. క ృష్ణ చదువు పూర్తి చేసుకుని మంచి ఉద్యోగంలో చేరిన తర్వాత తులసిని ఇచ్చి పెళ్లి చేస్తారు. పెళ్లయిన తర్వాత కూడా తులసి ముభావంగానే ఉంటుంది. అయిదేళ్ల కిందట కడుపులో చనిపోయిన పాప గురించి ఆలోచిస్తుంటుంది. ఆ పాపకు దియా అని పేరు పెట్టుకుంటుంది. అయితే క ృష్ణ రాకతో తులసి జీవితం మళ్లీ ఆనందమయం అవుతుంది. కానీ, దియా అనే పాప వాళ్ల మధ్య ఆత్మ రూపంలో తిరుగుతుంటుంది. తన తల్లిని తనని దూరం చేసిన వాళ్లందరి మీద పగ తీర్చుకుంటుంది. తనింట్లో తనకు పుట్టని ఓ పాప తిరుగుతోందని, అది ఆత్మ రూపంలో ఒక్కొక్కరిని చంపేస్తోందని తెలుసుకున్న తులసి ఏం చేసింది? ఆ ఆత్మ నుంచి తన భర్తను ఎలా కాపాడుకుంది? అనేది కథ

ఎలా ఉందంటే: ఇది ఒక ఆత్మ కథ. ఇందుకు దర్శకుడు భ్రూణ హత్యలను పాయింట్‌గా తీసుకున్నాడు. ఈ లోకాన్ని చూడకుండానే ఎన్నో పిండాలు బలైపోతున్నాయి. ప్రస్తుతం అబార్షన్ అనేది చాలా చిన్న మాట అయిపోయింది. కానీ, కడుపులో ఉన్న పిండానికీ ప్రాణం ఉంటుందని, తల్లిని చూడటానికి తహతహలాడుతుంటుందని అనుకొని దానిపై సినిమా తీయాలన్న దర్శకుడి ఆలోచనను అభినందించకుండా ఉండలేం. హారర్ థ్రిల్లర్ జోనర్‌లో చాలా సినిమాలు వచ్చాయి. చిన్నపిల్లల శరీరంలోకి ఆత్మలు వెళ్లిపోవడం, వారితో హత్యలు చేయించడం అనేది కూడా పాతదే. కానీ, ఆ ఆత్మ ఒక పిండానిది కావడం ప్రేక్షకుడిని కదిలిస్తుంది. అమ్మ పిలుపు కోసం ఆ ఆత్మ ఎప్పుడూ పరితపిస్తుంటుంది. ఈ సన్నివేశాలకు భయం, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో పాటు, తల్లి సెంటిమెంట్‌ను కూడా జోడించి ఎమోషనల్‌గా చూపించాడు. తనింట్లో తన కళ్ల ముందే తనకు కనిపించకుండా తనకి పుట్టని ఓ కూతురు తిరుగుతోందని తెలుసుకున్న ఓ తల్లి ఏం చేస్తుంది? ఎలా ఆలోచిస్తుంది? ఎలా ఉద్వేగానికి లోనవుతుంది? అనే పాయింట్ హ ృదయానికి హత్తుకునేలా దర్శకుడు తీర్చిదిద్దాడు. విశ్రాంతి ఘట్టం అందరినీ కదిలిస్తుంది. ఆ..! అబార్షన్ ఏముంది చాలా చిన్న విషయం అనుకున్నవారికి ఈ సినిమా ఒక కనువిప్పు. సాధారణంగా సినిమాల్లో ఆత్మలను, దెయ్యాలను చూడగానే భయం కలుగుతుంది. కానీ, దియాను చూడగానే ప్రేమ కలుగుతుంది. దర్శకుడి ఆలోచన కూడా అదే కావచ్చు.

ద్వితీయార్థం ప్రారంభంలో కథ కాస్త నెమ్మదిస్తుంది. దియా టార్గెట్ ఏంటో తెలిసిన తర్వాత కథను నడిపించడం మామూలు విషయం కాదు. సాధారణంగా సన్నివేశాల్లో స్తబ్దత వచ్చేస్తుంది. పోలీసు విచారణ మొదలైన తర్వాత మళ్లీ కథలో చలనం వస్తుంది. క్లైమాక్స్ అంతుపట్టని విధంగా రాసుకున్నాడు దర్శకుడు. అక్కడ కూడా తల్లీ కూతుళ్ల మధ్య ఉన్న ఎమోషనల్ బాండింగ్‌ను హైలైట్ చేశాడు. ద్వితీయార్థం అంతా ఒక భర్తను కాపాడుకునేందుకు భార్య పడే తపన కనపడుతుంది. అదే సమయంలో క్లైమాక్స్ కొత్తగా ఉంది. గుండెలకు హత్తుకునేలా ఆయా సన్నివేశాలు ఉంటాయి. ఇంతకు మించిన క్లైమాక్స్ ఊహించకూడదు. కథకు మంచి ముగింపు ఇచ్చాడు దర్శకుడు.

ఎవరెలా చేశారంటే: ముఖ్యంగా మూడు పాత్రల మధ్య సాగే కథ ఇది. క ృష్ణ, తులసి, దియాల మధ్య సాగే కథ. సాయి పల్లవి మరోసారి ఆకట్టుకుంటుంది. తల్లిగా, భార్యగా తన ఎమోషన్‌తో కట్టిపడేసింది. విశ్రాంతి ముందు సాయిపల్లవి నటన తప్పకుండా నచ్చుతుంది. ఎప్పుడూ చలాకీగా కనిపించే నాగశౌర్య ఈసారి సీరియస్ పాత్రలో కనిపిస్తాడు. ఒక రకంగా ఇది తనకి కొత్త ప్రయత్నమే. దియాగా నటించిన పాప వెరోనికా నటన మెప్పిస్తుంది. డైలాగ్‌లు కూడా ఉండవు. 'నిన్ను




చూడనీయకుండా చేశారు కదమ్మా!' అనే ఒకే ఒక్క డైలాగ్ ప్రేక్షకుల హ ృదయాలను పిండేస్తుంది. ఇందులో ప్రియదర్శి ఎస్సైగా కనిపిస్తాడు. మొదట్లో తన పాత్రని కాస్త కామెడీ చేశారు. చివర్లో సీరియస్‌నెస్ తీసుకొచ్చారు. మిగిలిన వాళ్లు పరిధి మేరకు నటించారు.

సాంకేతికంగా.. సినిమా బాగుంది. ముఖ్యంగా నేపథ్య సంగీతానికి మంచి మార్కులు పడతాయి. తక్కువ బడ్జెట్‌లో తీసిన సినిమా ఇది. కానీ, ఎక్కడా అలాంటి ఫీలింగ్ రాదు. భ్రూణ హత్యల నేపథ్యంలో ఒక కథను ఇలా కూడా చెప్పొచ్చా..? అనిపిస్తుంది. దర్శకుడి ఆలోచనకు, అతను తీసిన విధానానికి హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే.

## అవెంజర్స్- ఇన్ఫినిటీవార్ రివ్యూ

సూపర్ హీరోల చిత్రాలకు హాలీవుడ్‌లో కొదవలేదు. ముఖ్యంగా 'స్పైడర్‌మ్యాన్', 'సూపర్‌మ్యాన్', నుంచి నిన్న మొన్నటి 'బ్లాక్ పాంథర్' వరకూ అందరూ బాక్సాఫీస్‌ను కళకళలాడించిన వాళ్లే. ఇలాంటి చిత్రాలకు పుట్టినిల్లు మార్వెల్ స్టూడియోస్. ఇప్పటి వరకూ దాదాపు 17 సూపర్‌హీరో చిత్రాలను ఆ సంస్థ నిర్మించింది. ఈ వేసవిలో వినోదాల విందును పంచడానికి మార్వెల్ తీసుకొచ్చిన సరికొత్త యాక్షన్, సూపర్ హీరోస్ చిత్రం 'అవెంజర్స్ ఇన్ఫినిటీవార్'. ఈ శుక్రవారం విడుదలైన 'అవెంజర్స్..' ఎలా ఉంది? గత చిత్రాలకు దీటుగా అభిమానులను అలరించిందా?

కథేంటంటే: టైటాన్‌కు చెందిన భారీకాయుడు థానోస్. తనంత గొప్ప వ్యక్తి ఈ విశ్వంలో లేడని, మిగిలిన వాళ్లంతా తినడానికి తప్ప దేనికీ పనికిరారని అతడి అభిప్రాయం. అందుకే ప్రపంచాన్ని హస్తగతం చేసుకోవాలని భావిస్తాడు. అలా చేయాలంటే అత్యంత శక్తిమంతమైన ఆరు ఇన్ఫినిటీ స్టోన్స్‌ను సంపాదించాలి. అవి అక్కడక్కడా ఉంటాయి. వాటిని సాధించే ప్రయత్నం మొదలు పెడతాడు. ఆ క్రమంలో గార్డియన్స్.. ఇతర సూపర్‌హీరోలు థానోస్‌ను అడ్డుకునేందుకు యత్నిస్తుంటారు. మరి థానోస్ చివరకు శక్తివంతమైన రాళ్లను సొంతం చేసుకున్నాడా? అతడి ప్రయత్నాలను సూపర్‌హీరోలు ఏవిధంగా అడ్డుకున్నారన్నదే 'అవెంజర్స్: ఇన్ఫినిటీవార్'.

ఎలా ఉందంటే: ఒక విలన్.. అతను ప్రపంచాన్ని నాశనం చేయాలనుకోవడం. అతడి చర్యలను సూపర్‌హీరోలు అడ్డుకోవడం. మార్వెల్ విడుదల చేసిన గత చిత్రాలన్నీ దాదాపు ఇదే ప్లాట్‌తో కొనసాగుతాయి. 'కెప్టెన్ అమెరికా: సివిల్‌వార్'లో సూపర్ హీరోలు రెండు బ ృందాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు పోరాడటం మనం చూశాం. ఇప్పుడు వారంతా ప్రపంచాన్ని అంతం చేయాలనుకున్న థానోస్‌పై ఎలా పోరాడారన్నదానిని ప్రధాన ఇతివ ృత్తంగా తీసుకున్నాడు దర్శకుడు. అందుకు అనుగుణంగా సన్నివేశాలను అల్లుకుంటూ వెళ్లాడు. అయితే, థానోస్‌పై పోరాడే విషయంలో వాళ్లు బ ృందాలుగానే పోరాడుతారు. సూపర్ హీరోల చిత్రాలంటే యాక్షన్‌కు కొదవ ఉండదు. అందుకు తగినట్లుగానే భారీ యాక్షన్ సన్నివేశాలతో సినిమాను తీర్చిదిద్దారు. స్టార్క్, స్ట్రేంజ్, స్పైడర్ మ్యాన్, యాంట్ మ్యాన్‌లు కలిసి పోరాడే సన్నివేశాలు అద్భుతంగా ఉంటాయి. ఇక గార్డియన్స్, బ్లాక్ పాంథర్, హల్క్ ఒక బ ృందంగా థానోస్‌ను ఎదుర్కొంటారు. ఆయా సన్నివేశాల్లో విజువల్ ఎఫెక్ట్స్‌ను చాలా చక్కగా చూపించారు. థోర్ ర్యాంగ్‌రాక్‌లో మాదిరిగా బ్రూస్ బ్యానర్ (హల్క్)తో అక్కడక్కడా నవ్వులు పూయించారు.

కేవలం యాక్షన్ సన్నివేశాలు మాత్రమే కాదు. కాస్త సెంటిమెంట్‌ను కూడా దట్టించాడు దర్శకుడు. ఒక ఇన్ఫినిటీ స్టోన్ కోసం తన సొంత కూతురినే థానోస్ చంపుకోవడం, థానోస్‌కు అవసరమైన మరో స్టోన్ విజన్ తలపై ఉండటంతో తనని అంతం చేయాల్సిందిగా తన స్నేహితురాలిని కోరే సన్నివేశాలు భావోద్వేగంతో నడుస్తాయి. ఇక థోర్ తన కొత్త ఆయుధంతో తిరిగి వచ్చేటప్పుడు ఎలివేషన్ సీన్ ఓ కమర్షియల్ సినిమాకు తగ్గని రీతిలో ఉంటుంది. సూపర్‌హీరోస్ సినిమాలంటే అమితంగా ఇష్టపడుతూ వాటిని చూసేవారికి తప్పకుండా నచ్చుతుంది. అయితే, హల్క్‌ను ఎక్కువగా ఇష్టపడేవారికి మాత్రం ఈ చిత్రం నిరాశను మిగులుస్తుంది. చాలా తక్కువ సన్నివేశాల్లో హల్క్ కనపడతాడు. కెప్టెన్ అమెరికా కూడా కనిపించేది తక్కువే. అన్నట్లు తెలుగు వెర్షన్‌లో థానోస్‌కు యువ కథానాయకుడు రానా డబ్బింగ్ చెప్పడం విశేషం. రానా వాయిస్‌తో థానోస్ సంభాషణలు పలకడం ప్రేక్షకుడిని సరికొత్త సరదాను పంచుతుంది.

ఎవరెలా చేశారంటే: ఎప్పటిలాగే సూపర్‌హీరోల పాత్రల్లో ఆయా నటులు ఒదిగిపోయారు. అయితే, ఈసారి తెరపై కొత్తగా కనిపించిన విలన్ థానోస్. జోష్ బ్రోలిన్ అందులో చక్కగా నటించాడు. ఇక ఐరన్‌మ్యాన్‌గా కనిపించే రాబర్ట్ డౌనీ జూనియర్ ముఖంలో కాస్త కళ తప్పింది. బహుశా ఎప్పటి నుంచో ఆ పాత్రను ఆయన చేస్తుండటం, వయసు మీద పడటం కూడా కావచ్చు. దర్శకుడు ఆంథోనీ రుస్సో, జోయ్ రుస్సోలు ఎంచుకున్న కథ బాగున్నా, దాన్ని తీర్చిదిద్దిన విధానం ఎన్నో అంచనాలతో వెళ్లిన ప్రేక్షకుడిని కాస్త నిరాశ పరుస్తుంది. అయితే యాక్షన్ ప్రియులను మాత్రం ఏమాత్రం నిరాశ పరచదు. ఒక కమర్షియల్ సినిమాకు ఉండాల్సిన అన్ని జాగ్రత్తలను చిత్ర బ ృందం తీసుకుంది. అయితే అందరు సూపర్‌హీరోలకు సమాన ప్రాధాన్యం ఇవ్వలేదోమో అనిపిస్తుంది. బహుశా అలా ఇస్తూ పోతే సినిమా నిడివి పెరిగిపోతుందని భావించి ఉంటారు.



## విదేశాల్లో మహేశ్ మాయ..!



అగ్ర కథానాయకుడు మహేశ్‌బాబు 'భరత్ అనే నేను'తో స్వదేశంతోపాటు విదేశాల్లోనూ సత్తా చాటారు. కొరటాల శివ దర్శకత్వంలో ఆయన నటించిన చిత్రమిది. పొలిటికల్ డ్రామాగా రూపొందిన ఈ సినిమాలో మహేశ్ ముఖ్యమంత్రి పాత్రలో కనిపించి, ఆకట్టుకున్నారు. 'మనం సమాజంలో నివసిస్తున్నాం.. ప్రతి ఒక్కరికీ భయం, బాధ్యత ఉండాలి' అంటూ వచ్చిన ఈ సినిమా ప్రశంసలు అందుకుంది. ఈ చిత్రం ఓవర్సీస్‌లో అద్భుతమైన వసూళ్లు రాబడుతోందని సినీ విశ్లేషకుడు తరణ్ ఆదర్శ్ ట్వీట్ చేశారు. 'విదేశాల్లో మహేశ్‌బాబు మాయ.. అంతర్జాతీయ మార్కెట్‌లో తుపాను' అంటూ ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, యూరప్, ఆఫ్రికా, మలేషియా, సింగపూర్ తదితర దేశాల వసూళ్లను ట్వీట్ చేశారు. ఈ సినిమా తొలివారంలో ఉత్తర అమెరికాలో 3.015 మిలియన్ డాలర్లు, ఆస్ట్రేలియాంన్యూజిలాండ్‌లో 535,000 డాలర్లు, యూరప్ంయూకేలో 350,000 డాలర్లు, ఆఫ్రికాంమలేషియాంసింగపూర్, తదితర ప్రాంతాల్లో 150,000 డాలర్లు, గల్ఫ్‌లో 600,000 డాలర్లు మొత్తం 4.65 మిలియన్ డాలర్లు (మొత్తం రూ.31.04 కోట్లు) రాబట్టినట్లు చెప్పారు. ఈ సినిమా తొలి వారంలో ప్రపంచ వ్యాప్తంగా రూ.161.28 కోట్లు (గ్రాస్) రాబట్టినట్లు చిత్ర బ ృందం పేర్కొంది. 'బాహుబలి: ది కన్‌క్లూజన్' తర్వాత అతి తక్కువ సమయంలో అత్యధిక వసూళ్లు రాబట్టిన సినిమాగా ఇది రికార్డు స ృష్టించింది.